ప్రజాశక్తి

శుక్రవారం 25 నవంబర్ 2022 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

నేటి నుండి అంగన్‌వాడీ రాష్ట్ర మహాసభ

26 జిల్లాల నుండి తరలి రానున్న ప్రతినిధులు - విస్తృత ఏర్పాట్లు చేసిన ఆహ్వాన సంఘం

ప్రజాశక్తి-గుంటూరు



విలేకర్లకు వివరాలు వెల్లడిస్తున్న సుబ్బరావమ్మ తదితరులు



బ్యానర్లు కడుతున్న కార్యకర్తలు

అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర 10వ మహాసభలు శుక్ర, శనివారాల్లో గుంటూరు నగరంలో నిర్వహించనున్నారు. మహాసభల నిర్వహణకు ఏర్పడిన ఆహ్వాన సంఘం ఆధ్వర్యంలో అంగన్‌వాడీ యూనియన్, సిఐటియు, ఇతర ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టారు. కరపత్రాలు, పోస్టర్లు, సమావేశాల ద్వారా జిల్లాలో విస్తృత ప్రచారం నిర్వహించారు. మహాసభలు జరిగే రెవెన్యూ కళ్యాణ మండపాన్ని, మండపానికి వెళ్లే రహదారిలో తోరణాలు, బ్యానర్లతో అలంకరించారు.

మహాసభకు రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు సుమారు 500 మంది హాజరవుతున్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు. వారికి నగరంలోని వివిధ ప్రాంతాల్లో వసతి సౌకర్యం ఏర్పాటు చేశారు. గురువారం పాతగుంటూరు సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, జిల్లా కార్యదర్శి దీప్తి మనోజ తదితరులు మాట్లాడారు. మహాసభల ఏర్పాట్లను సుబ్బరావమ్మ వివరించారు.

2019లో సత్తెనపల్లిలో జరిగిన గత మహాసభ నాటి కర్తవ్యాలను సమీక్షించుకొని, ప్రస్తుత ప్రభుత్వ విధానాల నేపథ్యంలో భవిష్యత్ పోరాట కార్యాచరణ రూపొందించుకోవటంపై మహాసభలో చర్చిస్తామన్నారు. అంగన్‌వాడీలు గడిచిన మూడేళ్ల కాలంలో ప్రభుత్వంపై అనేక పోరాటాలు, ఆందోళనలు నిర్వహించి, అనేక విజయాలు సాధించామని చెప్పారు. ప్రధానంగా కనీస వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, బీమా,

▸ 2లో

రోడ్ల విస్తరణలో ప్రభుత్వానిది నిరంకుశ ధోరణి

- బి.ఫారాలకూ పరిహారం ఇవ్వాల్సిందే
- చంద్రయ్య నగర్ బాధితుల్ని పరామర్శించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబురావు

5 లో



బాధితులతో కలిసి నిరసన తెలియజేస్తున్న బాబురావు, సిపిఎం నాయకులు

1 నుంచి ధాన్యం కొనుగోలు

4 లో

రెండు లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి - త్వరలో తైవాన్ స్ప్రేయర్లు పంపిణీ

అదనపు కట్నం కోసం గర్భిణి హత్య కేసులో

భర్త, అత్తమామలు అరెస్టు

2 లో

ప్రైవేటు పాఠశాలలకు బాట

- విలీనంతో తరలిన విద్యార్థులు
- ప్రైవేటులో 1,81,613 మంది చేరిక
- ప్రభుత్వ, ఎయిడెడ్‌లో 1,20,815 మంది

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి



నూతన విద్యావిధానం అమలులో భాగంగా జిల్లాలో ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 3, 4, 5 తరగతుల విలీనం వల్ల వేలాది మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్లాల్సి వచ్చింది. జిల్లాలో మొత్తం 1683 ప్రాథమిక, ఉన్న, ప్రాథమికోన్నత పాఠశాలు ఉండగా వీటిల్లో 3,02,428 మంది విద్యార్థులున్నారు. వీరిలో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 1,20,815 మంది విద్యార్థులు, ప్రైవేటు పాఠశాలల్లో 1,81,613 మంది ఉన్నారు. జిల్లాలో మొత్తం 11,758 మంది ఉపాధ్యాయులు ఉండగా ప్రభుత్వ పాఠశాలల్లో 4598 మంది, ఎయిడెడ్ యాజమాన్యంలో 460 మంది, ప్రైవేటు

▸ 2లో

హామీలను కేంద్రం అమలుచేయాలి

విజయవాడలో రేపటి ధర్నాకు తరలిరండి : రైతు సంఘం

2 లో




మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు, ఇతర నాయకులు

2 లో

నిందితులపై కఠిన చర్యలు

- బాధితురాలిని అన్ని విధాలా ఆదుకుని అండగా ఉంటాం
- రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్‌ప్రసాద్
- పెత్తందారు చేతిలో అత్యాచార బాధితురాలికి పరామర్శ



బాధితురాలిని పరామర్శిస్తున్న విక్టర్ ప్రసాద్

ప్రైవేటు పాఠశాలలకు బాట

(మొదటి పేజీ తరువాయి)

పాఠశాలల్లో 6700 మంది ఉన్నారు. మొత్తం పాఠశాలల సంఖ్య 1683 ఉండగా వీటిల్లో ప్రభుత్వ పాఠశాలలు 979, ప్రైవేటు పాఠశాలలు 704 ఉన్నాయి.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గతంలో కంటే 10 శాతం వరకు తగ్గినట్లు అంచనా. గతంలో ప్రైవేటు కంటే ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువ మంది విద్యార్థులుండేవారు. ఈ సారి పరిస్థితి తల్లకిందులైంది. ఎయిడెడ్ వ్యవస్థలో తెచ్చిన మార్పుల వల్ల పలు పాఠశాలలు ఎయిడ్‌ను ఉపసంహరించుకుని అన్ ఎయిడెడ్ పాఠశాలలుగా కొనసాగుతున్నాయి. వీరు కార్పొరేట్ పాఠశాలల కంటే ఫీజులు కొంత తక్కువగా తీసుకుంటున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు అందుబాటులో లేని ప్రాంతాల్లో ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఎక్కువ మంది విద్యార్థులు చేరినట్లు చెబుతున్నారు.

నూతన విద్యా విధానం అమలులో భాగంగా 3,4,5 తరగతులను మొదటి దశలో కిలో మీటరు దూరంలో ఉన్న జెడ్‌పి, ప్రాథమికోన్నత, ప్రభుత్వ హైస్కూల్సులో విలీనం చేశారు. ఈ విద్యా సంవత్సరంలో గరిష్టంగా ఒక కిలో మీటరు దూరంలోఉన్న హైస్కూల్సులో కలిపారు. 3,4,5 తరగతుల విద్యార్థులకు ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశంలోని ఉన్నత పాఠశాలల్లోకి మార్చడం వల్ల చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 3,4,5 తరగతుల విద్యార్థులు సమీపంలోని ఉన్న హైస్కూల్సులోకి మార్చారు. జిల్లా మొత్తం మీద 54 పాఠశాలలను విలీనం చేసినట్టు అధికారులు తెలిపారు.

గతంలో తొలి దశలో ఒకే గ్రామంలో 250 మీటర్ల లోపు మాత్రమే విలీనం చేస్తామని చెప్పిన అధికారులు తరువాత కిలో మీటర్ దూరం ప్రాతిపదికన మార్పులు చేయడంపై జిల్లా వ్యాప్తంగా దాదాపు ఐదారు వేల మంది విద్యార్థులకు తీవ్ర నష్టం జరిగింది. జిల్లాలో దాదాపు 20 వేల మంది విద్యార్థులు డ్రాపౌట్స్ ఉన్నారని అంచనా వేసినా వీరిలో ఎక్కువ మంది ప్రైవేటు పాఠశాలల్లో చేరినట్టు గుర్తించామని అధికారులు చెబుతున్నారు. ప్రదానంగా బాలికలు ఎక్కువ దూరం వెళ్లలేక, ఆర్థిక స్థోమత లేని వారు స్థానికంగా ఉన్న చిన్న స్థాయి పాఠశాలల్లో చేర్పించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నేటి నుండి అంగన్‌వాడీ రాష్ట్ర మహాసభ

(మొదటి పేజీ తరువాయి)

వేతనంతో కూడిన మెడికల్ లీవ్ వంటి సౌకర్యాలు వంటి డిమాండ్లపైనా చర్చిస్తామన్నారు.

మొదటి రోజు ప్రారంభ సభలో ఎమ్మెల్సీ, ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు కెఎస్ లక్ష్మణరావు, యూనియన్ జాతీయ కార్యదర్శి వరలక్ష్మి, సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరసింగరావు, ఎం.ఎ.గఫూర్, ఐద్వా జాతీయ ట్రెజరర్ పుణ్యవతి తదితరులు ప్రసంగిస్తారని, అనంతరం ప్రతినిధుల సభ ఉంటుందని తెలిపారు. రెండోరోజు సాయంత్రం చివరిగా కమిటీ ఎన్నిక, అనంతరం 4 గంటలకు రెవెన్యూ కళ్యాణ మండపం నుండి వెంకటేశ్వర విజ్ఞాన మందిరం వరకూ ర్యాలీ నిర్వహిస్తామని, ర్యాలీలో అంగన్‌వాడీలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నాయకులు పిలుపునిచ్చారు.

కూలీలు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-ఫిరంగిపురం

ఉపాధి హామీ పని సమయాల్లో కూలీలు తగు జాగ్రత్తలు పాటించాలని మండల ఎంపిపి షేక్ నర్గీస్ అన్నారు. గురువారం మండలంలోని మునగపాడు, గుండాలపాడు, మెరికాపుడి, పోనుగుపాడు గ్రామ పంచాయలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2023-2024 ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే పనులు గురించి గ్రామ సభ నిర్వహించారు. ఈ ఏడాది చేయబోయే 16 రకాల ప్రాజెక్ట్స్ గిరించి వివరొచారు. అనంతరం షేక్ నర్గీస్ మాట్లాడుతూ పండ్ల తోటలు వేసే రైతులు గుర్తించి పండ్ల తోటలు వేయించాలన్నారు. ఉపాధి కూలీలు పని చేసిన వేజ్‌కి 40 శాతం మెటీరియల్ కాంపోనెంట్ కింద మన పంచాయతీని అభివృద్ధి చేసుకోవచ్చు అని తెలిపారు.

నిందితులపై కఠిన చర్యలు

- బాధితురాలిని అన్ని విధాలా ఆదుకుని అండగా ఉంటాం
- రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్ ప్రసాద్
- పెత్తందారు చేతిలో అత్యాచార బాధితురాలికి పరామర్శ

ప్రజాశక్తి - నరసరావుపేట

పెత్తందారీ సామాజిక తరగతికి చెందిన వ్యక్తి చేతిలో అత్యాచారానికి గురైన పట్టనంలోని క్రిస్టియన్‌పాలేనికి చెందిన దళిత యువతిని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్ ప్రసాద్ గురువారం పరామర్శించారు. ప్రకాశ్‌నగర్‌లోని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి అట్లూరి విజయ్‌కుమార్ నివాసంలో బాధితురాలిని పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. తాము అండగా ఉండి న్యాయం చేస్తామని ధైర్యం చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఐదేళ్లపుడే తల్లిదండ్రులు కోల్పోయిన యువతిని నాదెండ్ల మండలం అప్పాపురానికి చెందిన సాంబయ్య చౌదరి తన ఇంటికి తీసుకెళ్లాడని, ఆమెకు యుక్త వయస్సు వచ్చాక అత్యాచారానికి పాల్పడ్డంతోపాటు మరో ముగ్గురితో బయటకు పంపించి వ్యభిచారమూ చేయించేవాడని, ఈ ఉచ్చు నుండి తప్పించుకున్న యువతి పోలీసులను ఆశ్రయించిందని తెలిపారు. దీనిపై ఎఫ్ఐఆర్ నమోదైనా నిందితులను మాత్రం అరెస్టు చేయలేదని, మరో ముగ్గురు పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చలేదని, వాటినీ చేర్చాల్సి ఉందని అన్నారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంతోపాటు ఫోక్సో చట్టం కింద కేసు నమోదైందని, బాధితురాలి స్టేట్‌మెంట్‌ను నమోదు చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరామని అన్నారు. ఎస్సీ కమిషన్ పరిధి మేరకు చట్టపరిధిలో బాధితురాలికి అందాల్సిన సాయాన్ని అందిస్తామని, ఆమె కోరుకున్న చోట వసతి కల్పించాలని అధికారులను ఆదేశించామని, రక్షణ కల్పించాలని డీఎస్పీని కోరామని తెలిపారు. ఆమెకు ఉద్యోగావకాశం కల్పించడంపై జిల్లా కలెక్టర్, ఎస్పీతో మాట్లాడతామన్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన ఆమెపై హేయమైన దారుణానికి ఒడిగట్టారని, తట్టుకోలేని యువతి ఆత్మహత్య చేసుకుందామని నిర్ణయించుకున్నా అంధుడైన సోదరుని కోసం బాధలన్నీ దిగమింగిందని అన్నారు. ఆమె సోదరునికి సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్లో వసతితోపాటు ఆమెకు 3 నెలల జీవనానికి సరిపడా నిత్యావసరాలూ అందించాలని అధికారులకు సూచించామన్నారు. ఎక్స్‌గ్రేషియో కూడా ప్రభుత్వం నుండి వీలైనంత త్వరగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ శేషిరెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖాధికారి ఓబుల నాయుడు, తహశీల్దార్ రమణ నాయక్, డీఎస్పీ చిన విజయ భాస్కరరావు, మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జి.జాన్‌పాల్, ఎంఆర్‌పిఎస్ నాయకులు కె.సత్యం మాదిగ, విజయ్, జయరాం, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

హామీలను కేంద్రం అమలు చేయాలి

విజయవాడలో రేపటి ధర్నాకు తరలిరండి : రైతు సంఘం

ప్రజాశక్తి - తాడేపల్లి

ఢిల్లీలో రైతు ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. చారిత్రాత్మక రైతు ఉద్యమం ప్రారంభమై శనివారానికి రెండేళ్లవుతుందని గుర్తుచేశారు. ఏడాదిపాటు జరిగిన ఉద్యమం ప్రపంచ దృష్టిని ఆకర్షించిందని, ఆ పోరాటానికి దిగొచ్చిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పంటల మద్దతు ధరల చట్టం తెస్తామని, విద్యుత్ చట్ట సవరణ బిల్లు నుండి వ్యవసాయాన్ని మినహాయిస్తామని, రైతులపై కేసులు ఉపసంహరిస్తామని రాతపూర్వక హామీనిచ్చిందని తెలిపారు. అయితే వాటిని విస్మరించడం కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ బిల్లును యథాతథంగా పార్లమెంటులో ప్రవేశపెట్టడం సిగ్గుచేటన్నారు. పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని, రైతు రుణాలు రద్దుచేయాలి, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు ఉపసంహరించుకోవాలి, భూ సర్వేలో వస్తున్న తప్పులను సరిచేయాలి, ప్రతిగ్రామంలో గ్రామసభలు విధిగా నిర్వహించాలని, ధాన్యం మొత్తం మద్దతు ధరలకు కొనుగోలు చేసి 7 రోజులకు రైతులకు సొమ్ము చెల్లించాలని, అధికవర్షాలు, వరదలకు నష్టపోయిన రైతులందరికీ పరిహారం ఇవ్వాలని కోరారు. ఈ డిమాండ్లతో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శనివారం గవర్నర్‌కు మెమోరాండాలు ఇవ్వడంతోపాటు డిసెంబరు 1-11 తేదీల మధ్య పార్లమెంటు సభ్యులకు, రాజ్యసభ సభ్యులకు వినతిపత్రాలు ఇవ్వాలని పిలుపునిచ్చినట్లు తెలిపారు. విజయవాడలో శనివారం ఉదయం 10 గంటలకు ధర్నాచౌక్‌లో జరిగే ధర్నాలో పెద్దఎత్తున పాల్గొనాలని రైతులకు పిలుపునిచ్చారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు, తాడేపల్లి మండల అధ్యక్ష కార్యదర్శులు కె.వెంకటేశ్వరరావు, ఎం.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



పోటెత్తిన కృష్ణాతీరం

ప్రజాశక్తి - తాడేపల్లి

కార్తీకమాసం ముగింపు సందర్భంగా బుధవారం తెల్లవారురఘామునుండే కృష్ణానదికి మహిళలు పోటెత్తారు. కృష్ణానదిలో స్నానాలు ఆచరించారు. ఈ సందర్భంగా బకింగ్‌హామ్ కెనాల్, సీతానగరంలోని పుష్కరఘాట్లలో విద్యుత్ దీపాలతో అలంకరించారు.



మాట్లాడుతున్న గుంటుపల్లి రజని

మహిళలపై దాడులను అరికట్టాలి : ఐద్వా

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి రజని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఐద్వా రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రెంటపాళ్లలో నిర్వహించిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. నవంబర్ 25 మహిళలపై జరిగే హింస వ్యతిరేక దినోత్సవం నుండి డిసెంబర్ 10 మానవ హక్కుల దినోత్సవం వరకు 16 రోజులు పాటు ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం వివిధ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. మన రాష్ట్రంలో ఐద్వా ఆధ్వర్యంలో సమస్యలపై వివిధ పోరాటాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళలని రక్షించాల్సిన చట్టాలు ధనవంతులకు అధికారపార్టీ నాయకులకు చుట్టాలుగా మారాయని విమర్శించారు. హింసకు కారణమైన ఇంటర్నెట్ ప్రసార మాధ్యమాల్లో వచ్చే అశ్లీల చిత్రాలను నిరోధించి మద్యాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు. ఐద్వా ఏర్పడి 75 సంత్సరాలైన సందర్భంగా డిసెంబర్ 9, 10తేదీల్లో వజ్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గుంటుపల్లి రజని వెల్లడించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి మండల మహిళా సంఘం నాయకులు జమండ్లమూడి అనుష, దుగ్గి సుజాత, దుగ్గి మేరమ్మ, దుగ్గి ప్రశాంతి, ఎస్ఎఫ్ఐ నాయకురాలు దుగ్గి అమూల్య, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం గర్భిణి హత్య కేసులో

భర్త, అత్తమామలు అరెస్టు

ప్రజాశక్తి - చేబ్రోలు

అదనపు కట్నం కోసం గర్భిణిని వేధించడంతోపాటు ఆమెను హత్య చేశారనే కేసులో భర్త, అతని తల్లిదండ్రులను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ జి.వెంకటాద్రి వివరాల ప్రకారం.. మండలంలోని శేకూరుకు చెందిన జొన్న వెంకటేశ్వరరావు పెద్ద కుమార్తె మాధవికి, వేజండ్లకు చెందిన కర్రి నరేష్‌కు నాలుగేళ్ల కిందట వివాహమైంది. వీరికి 15 నెలల కుమారుడు ఉండడంతోపాటు మాధవి మళ్లీ నాలుగు నెలల గర్భిణి. పెళ్లి సందర్భంలో 60 సెంట్లు భూమి, నగదు, బంగారాన్ని కట్నంగా మాధవి కుటుంబీకులు ఇచ్చారు. అయినా అదనపు కట్నం కోసం భర్తతోపాటు రమాదేవి, శ్రీనివాసరావు వేధిస్తున్నారని మాధవి తన తల్లిదండ్రులకు ఫోన్‌లో చెప్పేది. ఈ క్రమంలో మాధవి ఈనెల 19వ తేదీన ఉరేసుకుని చనిపోయిందని, మృతదేహం ఆస్పత్రిలో ఉందని తెలిసిన తండ్రి వెంకటేశ్వరరావు వెళ్లి చూశాడు. అదనపు కట్నం కోసం భర్త, అతని తల్లిదండ్రులే ఇందటి ఘాతుకానికి పాల్పడ్డారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై తెనాలి డీఎస్పీ స్రవంతిరాయ్ కేసు దర్యాప్తు చేపట్టారు. గురువారం ఉదయం నిందితులు వేజండ్ల అడ్డరోడ్డు వద్ద ఉన్నట్లు సమాచారం రావటంతో డీఎస్పీతోపాటు పొన్నూరు రూరల్ సిఐ ప్రభాకర్, చేబ్రోలు ఎస్ఐ జి.వేంకటాద్రి వెళ్లి అరెస్టు చేశారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు.

స్వచ్ఛ గ్రామానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

ప్రజాశక్తి- మేడికొండూరు.

స్వచ్ఛగ్రామానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మేడికొండూరు జడ్పిటిసి సభ్యులు, మండల వైసిపి కన్వీనర్ కందుల సిద్దయ్య అన్నారు. మేడికొండూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఐటిసి బంగారు భవిష్యత్తు, ఫినిష్ సొసైటీ ఆధ్వర్యంలో గ్రామీణ ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా సిద్దయ్య మాట్లాడుతూ గ్రామాలు స్వచ్ఛందంగా ఉండేందుకు గ్రామస్తులు ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వచ్ఛ గ్రామానికి కృషి చేయాలన్నారు. ఎంపిపి మన్నవ స్వప్న రాజేష్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉండటం వలన మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. గ్రామంలో ఎక్కడా కూడా చెత్త నిలువలు లేకుండా చూడాలని అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని 14 గ్రామాలలోని డ్వాక్రా యానిమేటర్లకు ప్రత్యేక అవగాహన చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జి కరుణ కుమార్, ఈఓ పిఆర్‌డి పి. రవికుమార్ ,వెలుగు మండల అధికారి విజయభారతి ,ఫినిష్ సొసైటీ అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి ఎం. యశ్వంత్ శ్రీనివాస్, కే ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

పురుగు మందుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



పురుగుమందుల డబ్బాలను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- వినుకొండ

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల పురుగు మందల దుకాణాల్లో గురువారం రాత్రి విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. నిషేధిత బయో పురుగు మందులు విక్రయిస్తున్నారని సమాచారం మేరకు ప్రకాశం జిల్లా విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి గుంటూరు విజిలెన్స్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సిఐ లక్ష్మారెడ్డి అధికారుల బృందం షాపుళలో తనిఖీ చేశారు. రామ్, భీమ్ బయో పురుగు మందులును తనిఖీ చేసి శాంపిల్స్ సేకరిస్తున్నట్లు సిఐ లక్ష్మారెడ్డి తెలిపారు. బయోలో ఈ కంపెనీ పురుగు మందులు 2023 మార్చి వరకు కోర్టు అనుమతులు ఉన్నాయని, పరుగు మందుల విక్రయాల అనుమతులు (జి3) జాబితాలో ఉన్నట్లు గుర్తించారు. అయినప్పటికీ శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపడం జరుగుతుందని, ల్యాబ్ రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తనిఖీల్లో ఏడిఏ బోయపాటి రవిబాబు, ఏవో విజిలెన్స్ బృందం పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై డిఐజి సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వివిధ పోలీసు స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తుపై డిఐజి త్రివిక్రమ వర్మ గురువారం సమీక్షించారు. అధికారులతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యంగా పోలీస్ స్టేషన్‌లలో నమోదు అవుతున్న ఫోక్సో చట్టం ద్వారా నమోదు అయిన కేసులను త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని, మెడికల్ రిపోర్ట్స్, ఫోరెన్సిక్ నివేదికను ఫిర్యాదికి సంబంధించిన 164 స్టేట్ మెంట్ రికార్డు, మొదలైన వాటిని త్వరితగతిన పూర్తి చేసి, సాధ్యం అయినంత త్వరగా కోర్టులో చార్జిషీట్ వేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. వివిధ పోలీస్ స్టేషన్ లలో దర్యాప్తు పెండింగ్ లో ఉన్న ఇతర కేసులను సమీక్షించి, వాటికి సంబంధించి, నిందితులను అరెస్టు చేసి, దర్యాప్తులో ఉన్న కేసులలో అధికారులు అలసత్వం లేకుండా పనిచేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్‌పి ఆరిఫ్ హఫీజ్, అదనపు ఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పెండింగ్‌ఫైల్స్‌ను పరిశీలిస్తున్న డిఐజి

రాజధానిలో ప్రజా చైతన్య యాత్ర

ప్రజాశక్తి - తుళ్లూరు

ప్రజా చైతన్యం తోనే సమస్యలు పరిష్కార మవుతాయని మాజీ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ అన్నారు. గురువారం రాత్రి రాజధాని ప్రాంతం తుళ్లూరులో టిడిపి,అమరావతి జెఏసి ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర జరిగింది .స్థానిక కొత్తూరు సెంటరు నుంచి టిడిపి,రైతు జెఏసి నాయకులు,మహిళలు ర్యాలీగా స్థానిక వడ్డెర కాలనీకి వెళ్లారు.సమస్యలు అడిగి తెలుసుకున్నారు.గీతా మందిరం వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి టిడిపి జెండా ఎగురవేశారు.అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.ఎస్సీ కాలనీలో పర్యటించారు.ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ,రైతులకు,పేదలకు మధ్య తగాదాలు పెట్టేందుకే ఆర్ - 5 జోన్‌లో సెంటు స్థలం పంపిణీ అంటూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నాటకాలాడుతున్నారని విమర్శించారు. ప్రజాచైతన్య యాత్రకు భయపడి పేదలకు రూ 2,500లు ఫించన్ చెల్లించడం జరిగిందని చెప్పారు. రోడ్డెక్కితేనే సమస్యలు పరిష్కార మవుతాయని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ధనేకుల సుబ్బారావు, కాటా అప్పారావు,గడ్డం వెంకటేశ్వరరావు,చేకుర్తి రవి, మేరిగ నాగేశ్వరరావు, రైతు జెఏసి సమన్వయ కమిటీ సభ్యులు పి సుధాకర రావు, య నాగ మల్లీశ్వరి,పులి సువార్త,బి ప్రియాంక,అంకం సువర్ణ కమల పాల్గొన్నారు.



ప్రజాచైతన్య యాత్రలో పాల్గొన్న టిడిపి మహిళ నాయకులు, తదితరులు

ఎడాపెడా పన్నులు.. పింఛనులో కోతలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ఎడాపెడా పన్నుల పెంపుతో ప్రజలపై మోయలేని భారం మోపుతుందని తూర్పు నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి నసీర్ అహమ్మద్ అన్నారు. గురువారం సాయంత్రం బాదుడే-బాదుడు కార్యక్రమంలో మొహమ్మద్ నసీర్ ఇంటింటికి తిరిగి వైసిపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. అనంతరం వార్డు ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి దోచుకోవటం దాచుకోవటమే తప్ప రాష్ట్రంలో అభివృద్ధి ఊసే లేదని దుయ్యబట్టారు. నిత్యావసరాల ధరలు పెరిగి పేదవాడి జీవనం కష్టతరం మారితే ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఆర్టీసీ, విద్యుత్తు చార్జీలతో పాటు చెత్త పన్ను, ఇంటి పన్ను తదితర పన్నుల పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నాడని విమర్శించారు. కరెంటు బిల్లులు అధికమంటూ అమ్మ ఒడి లాంటి పథకాలు అర్హులకు తొలగించడం, పెన్షన్లలో కోతలు విధిస్తూ రాష్ట్రంలో తుగ్లక్ పాలన సాగిస్తున్నాడని అన్నారు.



బాదుడే బాదుడు కార్యక్రమంలో టిడిపి నాయకులు

వినుకొండ: వైసిపి ప్రభుత్వం ప్రజలపై పన్నులు మోత మోగించి, పెన్షన్లలో కోతలు విధిస్తుందని పలనాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీ.వీ.ఆంజనేయులు అన్నారు. గురువారం మండలంలోని భారతపురం గ్రామంలో మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు ఆకుమల్ల కాసిం అధ్యక్షతన నిర్వహించిన బాదుడే-బాదుడు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కరెంటు, ఆర్టీసీ చార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు, వంటగ్యాస్ ధరల పెంచి సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నారని అన్నారు. ఎం. ఏడుకొండలు, ఎం.రామ బ్రహ్మం, రామయ్య, వెంకట రెడ్డి, వెంకట్రావు, శ్రీనుపాల్గొన్నారు.

పల్నాడులో సినీ ఆడియో రిలీజ్ వేడుక

ప్రజాశక్తి-మాచర్ల

పల్నాడులో సినిమా ఆడియో రిలీజ్ ఫంక్షన్ వేడుకను మాచర్ల నరిశెట్టి కళ్యాణ మండపంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఉక్కు సత్యాగ్రహం సినిమాకు పల్నాడు వెల్దుర్తి గ్రామస్తులు ప్రముఖ దర్శక నిర్మాత పి. సత్యా రెడ్డి నిర్మాణ, దర్శకత్వం సారధ్యం వహించగా, మాచర్లకు చెందిన వేముల శ్రీనివాసరావు రచయితగా సినిమాకు పనిచేశారు. వేడుకకు విశ్రాంత జిల్లా ఉప విద్యాధికారి గాదె రామకష్ణారావు అధ్యక్షత వహించగా మాచర్ల మున్సిపల్ చైర్ పర్సన్ తురకా కిషోర్ ,పల్నాడు జిల్లా వ్యవసాయ అభివృద్ధి సలహా మండలి చైర్మన్ కుర్రి మార్కండేయ రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసారు. మాచర్ల మున్సిపల్ చైర్మన్ తురక కిషోర్ మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలో మాచర్లలో సినిమా తొలిసారిగా ఆడియో ఫంక్షన్ జరగటం సంతోషంగా ఉందన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటీకరణ జరగకూడదని ఈ సినిమా చూసి ప్రజలు మరింత స్ఫూర్తి పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో బిసి సంఘ నాయకులు జింకల నాగేశ్వరావు యాదవ్, మల్లికార్జున యాదవ్, అనవయ్య, కనకా ప్రసాద్, పులుసు సత్యనారాయణ రెడ్డి, పాపిరెడ్డి, పిచ్చిరెడ్డి, గురవారెడ్డిలు పాల్గొన్నారు.



రచయిత వేముల శ్రీనివాసరావును సన్మానిస్తున్న అతిథులు

కబడ్డీ జిల్లా విజేతగా పొన్నూరు టీం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

శాప్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సిఎం కప్ పోటీలలో గురువారం గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలలో పొన్నూరు నియోజకవర్గ విమెన్ కబడ్డీ టీం విజేతగా నిలిచిందని కబడ్డీ కోచ్ జక్కా శ్రీనివాస్ అన్నారు. ఏడు నియోజకవర్గాల టీంలు పాల్గొన్న ఈ టోర్నమెంట్ లో జక్కా శ్రీనివాస్ పర్యవేక్షణలో తర్ఫీదు పొందిన పొన్నూరు కబడ్డీ టీం జిల్లా ఛాంపియన్ గా నిలిచింది. అంతకుముందు ఉదయం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి చేతుల మీదుగా క్రీడాకారులకు జెర్సీలు అందజేశారు. సుజనా జయంతి స్పాన్సర్ చేస్తున్న ఈ కబడ్డీ టీం ప్లేయర్స్ రాష్ట్ర స్థాయిలో కూడా రాణించి పొన్నూరుకు మంచి పేరును తీసుకురావాలని జక్కా శ్రీనివాస్ ఆకాంక్షించారు. జిల్లా జట్టుకు మేనేజర్‌గా నాగిశెట్టి నాగరాజు వ్యవహరించారు.

108లో ప్రసవం

ప్రజాశక్తి- మేడికొండూరు

మండలంలోని పేరేచర్లలో 108లో మహిళ మగ బిడ్డను ప్రసవించిన సంఘటన గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బీహార్ రాష్ట్రం నుండి వలస కూలీగా వచ్చిన సుశీల కుటుంబం పేరేచర్లలో జీవనం సాగిస్తున్నారు. నిండు నెలలు కావడంతో సుశీలకు తెల్లవారుజామున పురిటి నొప్పులు వచ్చాయి. వెంటనే 108కి కాల్ చేయగా ఈఎంటి ప్రవీణ్ కుమార్, పైలెట్ సుబ్బారావు ఆమెను వాహనంలో ఎక్కించి గుంటూరుకు తీసుకు వెళ్ళేందుకు బయలుదేరారు. ఉన్నట్టుండి పేరేచర్ల జంక్షన్లో పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి గమనించిన 108 సిబ్బంది ప్రసవం చేశారు. సుశీల మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డ ఇరువురు క్షేమంగా ఉన్నారని సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా ఈఎంటి ప్రవీణ్ కుమార్ పైలెట్ సుబ్బారావు లను స్థానికులు అభినందించారు

టిడిపి అసత్య ప్రచారం

మేయర్ కావటి మనోహర్ నాయుడు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు డొంక రోడ్డులో ఇళ్ల తొలగింపుపై టిడిపి దుష్ప్రచారం చేస్తుందని మేయర్ కావటి మనోహర్ నాయుడు తెలిపారు. గుంటూరులోని తన కార్యాలయంలో గురువారం రాత్రి ఆయన మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. టిడిపి హయంలో రహదాల విస్తరణలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని, ధనికులకు టిడిఆర్ బాండ్లు ఇచ్చుకుని పేదలకు మొండి చేయి చూపారని ఆయన ఆరోపించారు. 2012లో ఈ రహదారి విస్తరణకు శ్రీకారం చుట్టారని, శంకర్ విలాస్ బ్రిడ్జి విస్తరణ పనులు చేపడుతున్నందున డొంక రోడ్డు పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. గతంలో తొలగించిన ప్రహరీలకు సంబంధించి శకలాలను తొలగించేందుకు బుధవారం యంత్రాలు తీసుకువెళితే ఇళ్లు తొలగిస్తున్నారని టిడిపి నాయకులు దుష్ప్రచారం చేశారని అన్నారు. ప్రతి ఒక్కరికి న్యాయం చేసిన తరువాతనే అవసరమైన మేరకు నిర్మాణాలను తొలగిస్తామని మేయర్ స్పష్టం చేశారు. గుంటూరు నగరాభివృద్ధిపై టిడిపి బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని, టిడిపి నేతలు రావాలని సవాల్ విసిరారు.



పోలీస్‌స్టేషన్ ఎదుట మహిళల నిరసన

ప్రజాశక్తి -మంగళగిరి

పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట తాడిబోయిన ఉమా యాదవ్ కుటుంబ సభ్యులు గురువారం రాత్రి నిరసన చేపట్టారు. టిడిపి నాయకులు తాడిపోయిన ఉమా యాదవ్ 2019 జూన్ 25వ తేదీన హత్యకు గురయ్యాడు. ఈ కేసు రాజీ పడాలని పట్టణ పోలీసులు వేధింపులు గురి చేస్తున్నారంటూ ఉమా యాదవ్ కుటుంబ సభ్యులు నిరసనకు దిగారు. పోలీసులు ఉమా యాదవ్ తమ్ముడు మహేష్‌ను అరెస్ట్ చేయడంతో పాత కేసులు తీసి అరెస్ట్ చేసి పోలీసులు బెదిరింపులు గురి చేస్తున్నారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. పట్టణ సిఐ బి అంకమ్మరావు మాట్లాడుతూ ఉమా యాదవ్ కుటుంబ సభ్యులు చేసే ఆరోపణలను ఖండించారు. మహేష్ పాత కేసులో ముద్దాయిగా ఉన్నాడని అందువలనే అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరచడం జరిగిందని తెలిపారు.

వాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి- మేడికొండూరు

రోడ్డుపైన ఎదురుగా వస్తున్న రెండు ద్విచక్ర చక్ర వాహనాలు బలంగా ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని మందపాడు సిరిపురం గ్రామాల మధ్య రోడ్‌లో గురువారం జరిగింది. మందపాడు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బంది తిరుమల, అరుణ ద్విచక్ర వాహనంపై వ్యాక్సినేషన్ చేసేందుకు సరిపూడి గ్రామం వైపు ద్విచక్రవాహనంపై వస్తున్నారు. అదే క్రమంలో సరిపుడి వైపు నుండి ద్విచక్ర వాహనంపై బొంత అభిషేక్ అనే వ్యక్తి వస్తూ వాహన నియంత్రణ కోల్పోయి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీ కొట్టాడు. ఈ ఘటనలో రెండు వాహనాల మీద ప్రయాణం చేస్తున్న తిరుమల, అరుణ, అభిషేక్‌లకు తీవ్ర గాయాలు అవ్వగా 108 సహాయంతో గుంటూరు ఆసుపత్రికి తరలించారు.

నలుగురు జూదరులు అరెస్టు

ప్రజాశక్తి- తెనాలి రూరల్

పేకాట ఆడుతున్న నలుగురు జూదరులను పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన మండలంలోని అంగలకుదురులో గురువారం చోటు చేసుకుంది.రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని నిమ్మతోటలో టార్చ్‌లైట్ వెలుగులో పేకాట ఆడుతున్న సమాచారం మేరకు దాడులు నిర్వహించి వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.5,030నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, ఆటో స్వాధీనం చేసుకోని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పంచాయతీ కార్మికుడు మృతి

ప్రజాశక్తి -దుగ్గిరాల

పంచాయతీ కార్మికుడు మేడ గోపయ్య అకాల మృతి చెందడంతో గురువారం అంత్యక్రియల్లో పంచాయతీ వర్కర్స్ యూనియన్ సభ్యులు పాల్గొని నివాళులు అర్పించారు. యూనియన్ సభ్యులు గోపయ్య భౌతిక కాయాన్ని సందర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు జెట్టి బాలరాజు, యూనియన్ నాయకుడు, పి. శ్రీరాములు, ఎస్. సురేష్,ఎన్. ప్రసాద్ ,ఎన్. యోగేశ్వరరావు ,బి సాంబశివరావు, వై రమేశ్వరరావు ,బి. అమ్మిరెడ్డి, బి. దాసుచ సిహెచ్. పోతురాజు తదితరులు నివాళులర్పించారు.



సమస్యల పరిష్కారానికి పోరాటాలు తప్పవు: ఎస్.ఎఫ్.ఐ

29, 30లలో మాచర్లలో పల్నాడు జిల్లా మహాసభ

ప్రజాశక్తి-మాచర్ల

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు తప్పవని ఎస్.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి ఎస్ రాజు, ఉపాధ్యక్షులు కె జ్యోతిష్‌కుమార్ అన్నారు. ఎస్.ఎఫ్.ఐ మండల, టౌన్ 4వ మహాసభలు మాచర్లలో గురువారం జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజు, జ్యోతిష్‌కుమార్‌లు మాట్లాడుతూ 1970 నుండి 'అధ్యయనం-పోరాటం' అనే నినాదంతో ఎస్.ఎఫ్.ఐ విద్యార్థి లోకం కోసం అనేక వీరోచిత ఉద్యమాలు నిర్మించటం వలన ఎన్నో సమస్యలు పరిష్కారమైనట్లు తెలిపారు. జిఓ నెం 42, 43, 77లను రద్దు చేసి ఎయిడెడ్ పాఠశాలలను కొనసాగించాలని, పిజి విద్యార్థులకు స్కాలర్ షిప్పులు అందించాలని డిమాండ్ చేశారు. ఎస్.ఎఫ్.ఐ మాజీ నాయకులు బండ్ల మహేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యమం ద్వారా సాధించుకున్న అనేక సదుపాయాలు నేటి పెట్టుబడిదారి పాలక ప్రభుత్వాలు వాటిని కొనసాగించకుండా పేద విద్యార్థులకు విద్యను దూరం చేస్తున్నాయని విమర్శించారు. నేడు హాస్టల్స్, వసతి, భోజనం తదితర సదుపాయాలు అనేక ఉద్యమాల ద్వారానే సాధించినట్లు చెప్పారు. పాలక పెట్టుబడిదారి ప్రభుత్వాలు పథకం ప్రకారం ప్రభుత్వం ఆధ్వర్యంలోని విద్యారంగాన్ని నాశనం చేసి, ప్రైవేట్ రంగంలో విద్యారంగాన్ని ప్రోత్సహించటం వలన విద్య అంగడిలో కొనుగోలు సరుకులా మారిందన్నారు. పేదలను క్రమంగా నాణ్యమైన విద్యకు దూరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మండల కమిటీ నూతన అధ్యక్షులుగా బి అమర్నాథ్, కార్యదర్శిగా రాఘవేంద్ర, టౌన్ అధ్యక్షులుగా దుర్గారావు, కార్యదర్శిగా వి చైతన్య, కమిటీ సభ్యులుగా జ్యోతిష కుమార్, వెంకటేష్, భార్గవ్, నాగారాజు నాయక్, మంత్రు నాయక్, అంజి నాయక్ తదితర 21 మందితో కమిటీను సమావేశం ఆమోదించింది.



అపురూప కట్టడంపై బౌద్ధభిక్షువుల ప్రశంసలు

ప్రజాశక్తి-విజయపురిసౌత్

నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో గురువారం భూటాన్‌కు చెందిన బౌద్ధ భిక్షువులు సందడి చేశారు. బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లెపల్లె లక్ష్మయ్య ఆధ్వర్యంలో బుద్ధవనం వద్ద వారిని స్వాగతించి నాగార్జునకొండలో వెలిసిల్లిన బౌద్ధ సంస్కృతి, ఆచార్య నాగార్జున జీవిత చరిత్రలపై అవగాహన కల్పించే ఏర్పాట్లు చేశారు. అంతర్జాతీయ బౌద్ధ సమాఖ్య ప్రతినిధులైన భూటాన్‌లోని 24 జిల్లాల బౌద్ధ విహార నాయకులతో కూడిన ఉన్నత స్థాయి బృందం బుద్ధవనంను సందర్శించారు. ఎంట్రెన్స్ ప్లాజాలోని బౌద్ధ చిహ్నాలు, అశోక ధర్మ చక్రం, బుద్ధ పాదాలు, సమకాలీనదంపతి శిల్పాల గురించి, బుద్ధచరిత వనం, జాతక వనం, ధ్యానవనం, స్థూపవనం గురించి బుద్ధిస్ట్ ఎక్స్‌ఫర్ట్ కన్సల్టెంట్ శివనాగిరెడ్డి, బౌద్ధ భిక్షువులకు వివరించారు. సిద్ధార్థుని జననం, మహాభినిష్క్రమణం మొదలైన శిల్పాలు తమ నెంతో ఆకట్టుకొన్నాయని బృందం నాయకుడు, థింపూలోని సెంట్రల్ మొనాస్టిక్ బాడీ, కార్యదర్శి, పూజ్య ఉగెన్ నాంగ్యాల్ అన్నారు.

1 నుంచి ధాన్యం కొనుగోలు

- రెండు లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి
- తైవాన్ స్ప్రేయర్‌లు పంపిణీ
- డి.ఎ.ఓ ఐ.మురళీకృష్ణ

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

జిల్లాలో 90 వేల ఎకరాల్లో వరి సాగు ఉందని, దీని ద్వారా 2 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి రానున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఐ.మురళి తెలిపారు. గురువారం వినుకొండకు వచ్చిన ఆయన స్థానిక ఫర్టిలైజర్స్ అసోసియేషన్ హాల్‌లో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం ధాన్యం కొనుగోలు జరుగుతుందని, ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 327 ఆర్బికే కేంద్రాలను అనుసంధానం చేసి అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. డిసెంబర్ 1 నుండి ధాన్యం కొనుగోలు ప్రక్రియ మొదలవుతుందని, ఆర్.బి.కెల్లో విఎల్‌ఏల ద్వారా పంట తేమశాతం పరిశీలన చేసుకోవాలని తెలిపారు. సివిల్ సప్లై సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ధాన్యం కొనుగోలుకు గోతాలు, ట్రాన్స్‌పోర్టు,హమాలీల ఏర్పాట్లు అన్ని అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. జిల్లాలోని రైతులకు తైవాన్ స్ప్రేయర్లు, టార్పాలిన్ పట్టాలు త్వరలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వారం రోజుల్లో ప్రభుత్వం నుండి వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశాలు రాగానే లబ్ధిదారుల ఎంపిక చేసి తైవాన్ స్ప్రేయర్లు, టార్పాలిన్



పట్టాలు అందజేయడం జరుగుతుందని వివరించారు. డ్రోన్ల ద్వారా ఎరువులు, పురుగుమందుల పిచికారికి సరికొత్త ప్రణాళిక తీసుకురావడం జరిగిందన్నారు. జిల్లాలోని 28 మండలాల్లో 84 గ్రూపులను గుర్తించి ఒక్కొక్క గ్రూపులో ఇంటర్మీడియట్ పై చదువుకున్న వ్యక్తిని డ్రోన్ ఆపరేటింగ్ పైలెట్‌గా ఎంపిక చేసి ఈ నెల 28న లాం ఫార్మ్ లో శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. జిల్లాలో 2.20 లక్షల హెక్టార్లలో పంటలు సాగు చేస్తు న్నారని ఇప్పటికి 90 శాతం ఈ-క్రాప్, ఈ-కేవైసి పూర్తయిందని వివరించారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

చట్టానికి లోబడి ఎరువులు, పురుగుమందులు, విత్తనాల విక్రయాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని వ్యాపారులను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ.మురళి హెచ్చరించారు. పట్టణంలోని ఫర్టిలైజర్స్ అసోసియేషన్ హాల్‌లో గురువారం వ్యాపారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ అనుమతులు లేకుండా పురుగు మందులు, ఎరువులు, విత్తనాలను విక్రయిస్తే క్రిమినల్ కేసులు తప్పవని,ఎమ్మార్పీలకు మించి విక్రయాలు చేయొద్దని హెచ్చరించారు. అనుమతులు పొందిన కంపెనీల వద్దే కొనుగోలు చేయాలని, విక్రయాలు జరిపితే తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని, రైతు పూర్తి వివరాలు నమోదు చేయాలని వ్యాపారులను ఆదేశించారు. జిల్లాలో ఎరువులు సమృద్ధిగా ఉన్నాయని, కావలసినవారికి సరఫరా చేయడం జరుగుతుందన్నారు. సదస్సులో డివిజన్ అధికారి రవి కుమార్, ఏడిఏ బి. రవిబాబు తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎంఈఓ ప్రసాద్‌కు వినతిపత్రం

స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయి

ప్రజాశక్తి-గురజాల :

గురజాల మండల సిఐటియు మహాసభ గురు వారం స్థానిక కృష్ణయ్య స్కూల్‌లో గురువారం సాయంత్రం జరిగింది ఎస్.ప్రమీల అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ డి. శివకుమార్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయని, ఉద్యోగ భద్రత కరు వైందని అన్నారు. బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం వాటిని రద్దు చేసిందని, నాలుగు వేతన కోడ్‌లుగా మార్చి కార్మికుల జీవితాలను చిన్నా భిన్నం చేశారని విమర్శించారు. భవిష్యత్తులో సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున ఉద్యమాలకు రావాలని కార్మికులను కోరారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎంఈఓ ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. సిఐటియు గురజాల మండల కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా జ్యోతి, షేక్ మహబూబ్, ఉపాధ్యక్షులుగా ప్రమీల, సహాయ కార్యదర్శిగా రత్నకుమారి, కోశాధికారిగా కృష్ణకుమారి,13 మందితో నూతన కమిటీకి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



చిట్టి బుర్రలు..గట్టి ప్రయోగాలు

ప్రజాశక్తి-యడ్లపాడు : మండలంలోని ఉన్నవ, లింగారావుపాలెం, యడ్లపాడు, తిమ్మాపురం, సందెపూడిలలోని హైస్కూళ్లలో పాఠశాల స్థాయి సైన్స్ ఫెయిర్ గురువారం నిర్వహించారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు 238 ప్రాజెక్టులు ప్రదర్శించారు. పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. ఐదు ఉత్తమ నమూనాలను మండల స్థాయి ప్రద ర్శనకు ఎంపిక చేస్తా మని మండల విద్యాశాఖ అధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు.

కుల వివక్ష, అంటరానితనం నిర్మూలనే లక్ష్యం

ప్రజాశక్తి-క్రోసూరు

దళితులపై కొనసాగుతున్న కుల వివక్ష, అంటరానితనంను నిర్మూలించడమే కెవిపిఎస్ లక్ష్యమని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి అన్నారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం పల్నాడు జిల్లా ప్రథమ మహాసభ గురువారం క్రోసూరు లోని బంకా పుల్లారావు నగర్ (ఆమంచి విజ్ఞాన కేంద్రం)లో జి.రవిబాబు అధ్యక్షతన జరిగింది. మాల్యాద్రి మాట్లాడుతూ నేటికీ దళితులపై కుల వివక్ష, అంటరాని తనం ఏ రూపంలో ఉన్నా దానిని అంతం చేసేం దుకు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కార్యకర్తలు సన్నద్ధం కావాలని పిలుపు నిచ్చారు. అటువంటి పోరాటాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించడం కోసం ఈ నెల 28, 29 తేదీల్లో కర్నూలులో జరగనున్న రాష్ట్ర మహాసభల్లో సన్నద్ధం చేస్తామని చెప్పారు. కెవిపిఎస్ చేసే పోరాటాల్లో పాల్గొనేందుకు, అండదండలు ఇవ్వాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. కేం ద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం మనుధర్మ శాస్త్ర భావ జాలాన్ని సమాజంలో విస్తృతంగా తీసుకు వెళ్లే ప్రయత్నం చేస్తోం దని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పగించడం ద్వారా రాజ్యాంగం ద్వారా దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలకు రాజ్యాంగం ద్వారా కల్పించిన రిజర్వేషన్లు లేకుండా చేయడమేనని విమర్శించారు. ఈ నేపథ్యంలోనే మతం మారిన దళి తులకు రిజర్వేషన్లు కల్పించడం కుదరదని సుప్రీంకోర్టుకు అఫిడవిట్ ఇచ్చారన్నారు. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్రం లోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపిలు నోరు మెదపడం లేదని విమర్శించారు. అత్తలూరు గ్రామ దళిత మహిళా సర్పంచ్ బంక సరోజినేని కులం పేరుతో దూషించి, దాడి చేయబోయిన అగ్రవర్ణ పెత్తం దారు లను వెంటనే అరెస్టు చేయకపోతే తీవ్ర మైన పోరాటం చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో ఉన్న దళిత, గిరిజన ప్రజా ప్రతి నిధుల హక్కులను కాపాడేందుకు కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఆందోళనకు రూపకల్పన చేయాలని కోరారు. మహాసభ ప్రారంభం సంద ర్భంగా జిల్లా నాయకులు గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లయినా దళితులపై కుల వివక్ష, అంటరానితనం కొనసాగుతున్నా యంటే దానికి కారణం పాలకుల నిర్లక్ష్యమేనని విమర్శించారు. అనంతరం కార్యదర్శి నివేదికను జిల్లా కార్యదర్శి చింత పల్లి నాగ మల్లేశ్వరరావు ప్రవేశపెట్టగా



మాట్లాడుతున్న ఆండ్ర మాల్యాద్రి, వేదికపైన విజయకుమార్ తదితరులు

మహాసభలో పాల్గొన్న ప్రతినిధులు చర్చిం చి ఆమోదించారు. ప్రతి దళితవాడకు రెండు ఎకరాల శ్మశాన స్థలాన్ని ఇవ్వాలని, దళితుల గృహాలకు ఉన్న విద్యుత్ పాత బకాయిలను రద్దు చేయా లని, మతం మారిన దళి తులకు రిజర్వేషన్లు కొనసాగించాలని, సర్పంచ్ బంక సరోజిని ఘటనలో అగ్రవర్ణ అహంకారులను వెంటనే అరెస్టు చేయా లనే మహాసభ తీర్మానాలను ఆమో దించారు. ఈ మేరకు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహా సభలో ప్రజానాట్యమండలి జిల్లా కార్య దర్శులు దుగ్గి నాగేశ్వరరావు,తాళ్లూరి పెద్ది రాజు పాల్గొని పాటలు పాడి సంఘీభావం తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి బాలకృష్ణ, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు టి.హనుమంతరావు తది తరులు పాల్గొని సౌహార్ద్ర సందేశాలిచ్చారు. మహాసభలో అత్తలూరు సర్పంచ్ బంక సరోజిని, కెవిపిఎస్ జిల్లా నాయకులు బి. సూరిబాబు, ఎ.సుంద రయ్య, గర్నెపూడి సురేష్, బొల్లెపల్లి రామా రావు పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణలో ప్రభుత్వానిది నిరంకుశ ధోరణి

బి.ఫారాలకూ పరిహారం ఇవ్వాల్సిందే
చంద్రయ్య నగర్ బాధితుల్ని పరామర్శించిన
సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబురావు

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వం రోడ్ల విస్తరణలో నిబంధనలు పాటించకుండా, ఏకపక్షంగా నిరంకుశంగా వ్యవహరిస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు విమర్శించారు. బుల్డోజర్లతో బాధితులపై బెదిరింపులకు పాల్పడుతుందన్నారు. గుంటూరు, శ్రీనగర్ కాలనీలోని చంద్రయ్య నగర్‌లో గుంటూరు నగరపాలక సంస్థ చేపట్టిన రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న బాధితులను బాబూరావు, జిల్లా, నగర నాయకులు గురువారం పరామర్శించారు.ఈ సందర్భంగా బాధితులతో కలిసి రోడ్డుపై నిరసన తెలిపారు. 70 ఏళ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్నామని, కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా కూల్చివేత చేపట్టారని బాధితులు నాయకుల ఎదుట వాపోయారు. పట్టాదారులతో సమానంగా బి.ఫారాలున్న వారికి, లేని వారికీ అందరికీ పరిహారం ఇవ్వాలని బాబూరావు డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన బి.ఫారాలనే ప్రభుత్వం గుర్తించకపోతే ఎలాగని ప్రశ్నించారు. విజయవాడలో దుర్గగుడి ప్లైఓవర్ నిర్మాణంలో ఇళ్లు కోల్పోతున్న బి.ఫారాలకూ పరిహారం ఇచ్చారని గుర్తు చేశారు. గత మూడున్నర సంవత్సరాలుగా ఇళ్ల నిర్మాణం నత్తనడకన సాగుతుందని, కానీ ఇళ్లు కూల్చివేతకు మాత్రం ప్రభుత్వం ఆగమేఘాలపై బుల్డోజర్లు పంపిస్తుందని విమర్శించారు. ఎన్నికలకు ముందు అందరికీ బి.ఫారాలు ఇస్తామని, బి.ఫారాలున్న వారికి రిజిస్ట్రేషన్లు చేస్తామని, అందరికీ ఇళ్లు



కార్పొరేషన్ అధికారులు కూల్చి వేయించిన ఇళ్లు

కటిస్తామని వాగ్దానం చేసి విస్మరించారని విమర్శించారు. పరిహారం ఇవ్వకపోగా ఇన్నాళ్లు బి.ఫారాల్లో ఉన్నందుకు ప్రభుత్వానికి ఎదురు కట్టాలని జిఎంసి అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ మాట్లాడుతూ 1, 2వ ఫేజ్‌లలో చేపట్టిన విస్తరణలో పట్టాదారులకు ఇచ్చిన విధంగా బి.ఫారాలు ఉన్న వారికి, లేని వారికీ పరిహారం ఇవ్వాలని కోరారు. విస్తరణలో పోగా మిగిలిన భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని, బిఫారాలు లేని వారికి బి.ఫారాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2012లో ఇచ్చిన నోటీసులు చెల్లుబాటు కావు అన్నారు. తక్షణమే ప్రభుత్వం నిరంకుశ వైఖరి మార్చుకొని, పరిహారం ఇవ్వాలని కోరారు. బాధితుల్ని పరామర్శించిన వారిలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.భావన్నారాయణ నగర నాయకులు నికల్సన్, కళ్యాణి, ఖాసింషహీద్, చిష్టీ, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

నోటీసులు ఇవ్వకుండా పడేస్తున్నారు : సుబ్బలక్ష్మి



రిజిస్ట్రేషన్లు చేస్తామంటే మిమ్ముల్ని గెలిపించాము. నోటీసులు ఇవ్వకుండా ఇళ్లు పడేస్తున్నారు. పరిహారం ఇవ్వపోతే మేం ఎక్కడికి పోవాలి. 70 ఏళ్ల క్రితం బి.ఫారాలు ఇచ్చారు. ఇంత వరకూ రిజ్రిస్ట్రేషన్లు చేయలేదు. రిజిస్ట్రేషన్లు చేసి ఉంటే మాకు ఈ పరిస్థితి వచ్చేది కాదు. ఇప్పటికైనా రిజిస్ట్రేషన్లు చేసి, ప్రభుత్వ హామీ నిలబెట్టుకోవాలి.

పరిహారం ఇస్తామని నమ్మించారు : గాంధీ



40 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాము. 2012లో 60 అడుగుల రోడ్డు చేస్తామని విస్తరణ కార్యక్రమం చేపట్టారు. సుమారు 12 అడుగులు పోతుందని మార్కింగ్ చేశారు. అందరికీ బాండ్లు, పరిహారం ఇస్తామని నమ్మించారు. కొందరు కోర్టుకు వెళ్లడంతో ఆగింది. జగన్ ప్రభుత్వం బి.ఫారాలు క్రమబద్ధీకరిస్తామని, లోన్లు ఇస్తామని చెప్పటంతో సంతోషించాము. హటాత్తుగా వచ్చి ఇళ్లు కూల్చివేత చేపట్టారు.

పట్టాదారులతో సమానంగా పరిహారమివ్వాలి : నాగరాజు



నష్టపోతున్న భూమికి బాండ్లుగానీ, స్థలంగానీ ఇస్తామన్నారు. 1, 2వ ఫేజుల్లో పట్టాదారులకు రెండు రెట్లు అదనంగా ఇచ్చారు. మాకూ అదే విధంగా ఇవ్వాలని కోరుతున్నాము. ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చినప్పుడు బి.ఫారాలు రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. ఇప్పుడు ట్యాంక్‌ల్యాండ్స్ అంటున్నారు. ఎన్నికల్లో గుర్తు లేదా ట్యాంక్ ల్యాండ్స్ అని. రోజూ అధికారులు వచ్చి బెదిరిస్తున్నారు. ఇక్కడంతా వీకర్స్ సెక్షన్లు ఉన్నారు. వారిని ఈవిధంగా చేయటం సరికాదు. అధికారులకు చిత్తశుద్ధి ఉంటే తమకు న్యాయం చేయాలి. లేదంటే ఆందోళన చేస్తాము.

రిజిస్ట్రేషన్లు చేయాలి :ఎస్.మహాలక్ష్మమ్మ



మా ఇళ్లకు రిజిస్ట్రేషన్లు చేస్తే బ్యాంకు లోన్లు పెట్టుకుంటాము. ఆ సొమ్ముతో ఇళ్లు కట్టుకుంటాము. అవి తర్వాత మా పిల్లలకు ఉపయోగపడతాయి. ఎన్నాళ్లు ఇలా సమస్యలతో బాధలు పడాలి.

నష్టపరిహారం ఇస్తాం : కమిషనర్

అంగీకారంతోనే ప్రహరీల తొలగింపు

2012లో చేపట్టిన విస్తరణ పనులు - తిరిగి కొనసాగింపులో ప్రహరీల తొలగింపు

ప్రజాశక్తి -గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరులో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రోడ్ల విస్తరణ కీలకమని, 2012లో చేపట్టిన విస్తరణ పనులను ఇటీవల తిరిగి ప్రారంభించామని కమిషనర్ చేకూరి కీర్తి తెలిపారు. గుంటూరులోని తన కార్యాలయంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. అమరావతి రోడ్డు నుంచి డొంక రోడ్డు వరకు జరుగుతున్న రహదారి విస్తరణకు రూ.98 లక్షలు కేటాయించామన్నారు. ఈ రోడ్డు విస్తరణకు ఆక్రమణలు, ఇతర నిర్మాణాలను తొలగించేందుకు 23 మంది నుంచి అంగీకార పత్రాలు స్వీకరించామని తెలిపారు. కేవలం ప్రహరిగోడలను మాత్రమే తొలగిస్తున్నామని, వీరికి సంబంధించి ఇళ్లు తొలగించడంలేదన్నారు. ఇప్పటికే పెద్ద పలకలూరు, నందివెలుగు, కొత్తపేట రోడ్ విస్తరణ పనులు దాదాపు పూర్తి అయ్యాయని, నూతనంగా చేపట్టిన ఏటి అగ్రహారం రోడ్డు కూడా వేగంగా పనులు జరుగుతున్నాయన్నారు. ఆయా రోడ్లలో రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకు నిధుల మంజూరు కూడా జరిగి టెండర్ ప్రక్రియ పూర్తయిందన్నారు. గుంటూరు నగర పశ్చిమ, తూర్పు నియోజకవర్గాలకు అనుసంధానం చేసే శంకర్ విలాస్ ఆర్ఒబిని విస్తరింపచేయడానికి త్వరలో పనులు ప్రారంభించాల్సి ఉన్నందున శ్రీనగర్ మీదుగా డొంక రోడ్డు పనులు ప్రారంభించామని అన్నారు. డొంక రోడ్ విస్తరణకు 2012లోనే డిపిఆర్ తయారైందన్నారు. 23 మందికి నుంచి ఎంత వరకు నిర్మాణం తొలగించామో వారికి సొమ్ము చెల్లించేందుకు వారి బ్యాంకు ఖాతాల నంబర్లు కూడా తీసుకున్నామని తెలిపారు. ఈ ఇళ్లన్ని బి.ఫారాలకు సంబంధించినవి కావడంతో వారికి టిడిఆర్ బాండ్లను ఇవ్వడం సాధ్యం కాదన్నారు. తొలగించిన నిర్మాణాలకు మాత్రం విలువ కట్టి వారి ఖాతాల్లో జమ చేస్తామన్నారు. పూర్తిగా స్థలం, ఇళ్లు కోల్పోయే వారికి ప్రత్యామ్నాంగా ఇంటిస్థలం, ఇంటి నిర్మాణం జగనన్న కాలనీలో ఇస్తామన్నారు. బుధవారం డొంక రోడ్ విస్తరణ పనులు చేసే క్రమంలో కొందరు అపోహలతో అడ్డుకున్నారని, వాస్తవానికి వారి ఇళ్ల తొలగింపు ప్రస్తుతం లేదన్నారు.

27న సచివాలయ ఉద్యోగుల సభ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు సంఘటితంగా ముందుకు వెళ్లాలని, అప్పుడే హక్కుల సాధన సాధ్యమవుతుందని ఎపి జెఎసి జిల్లా అధ్యక్షుడు సంగీతరావు అన్నారు. ఈ నెల 27వ తేదీన విజయవాడలో తలపెట్టిన గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రథమ మహా జనసభను విజయవంతం చేయాలని కోరుతూ వివిధ సచివాలయాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా సంగీతరావు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులందరినీ ఒక తాటిపైకి తీసుకొచ్చేందుకు గ్రామ, వార్డు సచివాలయాల సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ సంఘం ద్వారా సచివాలయ ఉద్యోగులంతా ఐక్యతను చాటాలన్నారు. ఈ నెల 27వ తేదీ విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే సచివాలయ ఉద్యోగుల మహాజన సభకు అధిక సంఖ్యలో ఉద్యోగులు తరలిరావాలని పిలుపునిచ్చారు. విజయవాడ లెనిన్ సెంటర్ నుంచి ప్రారంభమయ్యే ర్యాలీలో వేల సంఖ్యలో ఉద్యోగులు పాల్గొంటారని చెప్పారు. ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రులు బొత్స సత్య నారాయణ, ఆదిమూలపు సురేష్, ముత్యాలనాయుడు ఇతర నాయకులు హాజరవుతున్నారని వెల్లడించారు. రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కిరణ్ కుమార్, గ్రేడ్-2 వీఆర్వోల సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శి అనుపమ, గుంటూరు జిల్లా గ్రేడ్-1 వీఆర్వోల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆయూబ్ ఖాన్ పాల్గొన్నారు.



డొక్కాకు జనచైతన్య వేదిక శుభాకాంక్షలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : వైసిపి జిల్లా అధ్యక్షులుగా ఎంపిక అయిన డొక్కా మాణిక్య వరప్రసాద్‌ను జన చైతన్య వేదిక బృందం రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి గురువారం అభినందించారు. మానవతావాది, నిత్య అధ్యయనశీలి డొక్కా మాణిక్య వరప్రసాద్‌ను జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేసినందుకు సిఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, తెలుగు భాషోద్యమ సంస్థ కన్వీనర్ డాక్టర్ వి.సింగారావు, చరిత్ర అధ్యాపకులు డాక్టర్ పాలేరు పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ పార్క్ పనులు వేగవంతం చేయాలి

ప్రతివారం నేరుగా సమీక్ష : నగర కమిషనర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి-గుంటూరు



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

గాంధీ పార్క్ అభివృద్ధి పనులు వేగంగా చేపట్టాలని, కాంట్రాక్టర్‌కు పనుల వారీగా నిర్దేశిత గడువు విధించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి జిఎంసి ఎస్.ఈ.ని ఆదేశించారు. గురువారం కమిషనర్ గాంధీపార్క్ అభివృద్ధి పనులు, మహబూబ్‌నగర్‌లో నూతనంగా నిర్మాణం చేసిన సిసి డ్రెన్‌ను తనిఖీ చేసి ఇంజినీరింగ్ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. గాంధీ పార్క్ పనులు వేగవంతం చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. నగరం నడిబొడ్డున ఉన్న ఈ పార్క్‌లో వాకింగ్ ట్రాక్, గ్రీనరి, ఓపెన్ జిమ్, ప్లే ఎక్విప్మెంట్స్ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే స్కేటింగ్ రింగ్ కూడా మరింత ఆధునాతన విధానంలో పునర్నిర్మాణం చేయాలన్నారు. పార్కింగ్, స్టాల్స్, మరుగుదొడ్ల ఏర్పాటు పక్కాగా ఉండాలన్నారు. ఇక నుండి ప్రతి వారం పార్క్ అభివృద్ధి పనులను నేరుగా సమీక్షిస్తామని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కి సూచించారు. అనంతరము మహబూబ్ నగర్‌లో రూ.20లక్షలతో 584 మీటర్ల నిర్మాణం చేసిన సిసి డ్రెన్ నాణ్యతను పరిశీలించారు. పర్యటనలో 51 వార్డు కార్పొరేటర్ ముప్పవరపు భారతి, ఎస్.ఈ. భాస్కర్, ఈఈ కోటేశ్వరరావు, కొండారెడ్డి, డి.ఈ.ఈ. శ్రీనివాసరెడ్డి, ఏడి.హెచ్. రామారావు, ఏ.ఈ.లు సేతుబాబు, రాంబాబు పాల్గొన్నారు.

గ్రూప్స్ అభ్యర్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్

ప్రజాశక్తి-గుంటూరు



మెటీరియల్ అందచేస్తున్న హరిచందన్, కృపాదాస్ తదితరులు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో గ్రూప్-1, 2 పోటీ పరీక్షలకు శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులకు వేద సీడ్స్, వికాస్ ఆగ్రోస్ ఆధ్వర్యంలో ఉచితంగా స్టడీ మెటీరియల్ అందచేశారు. శిక్షణ పొందుతున్న వారికి మాక్‌టెస్ట్ నిర్వహించి, ప్రతిభ చూపిన 50 మందికి వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చెరుకూరి హరిచందన్ పర్యవేక్షణలో ఈ మెటీరియల్ అందచేశారు. ఈ సందర్భంగా వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ మాట్లాడుతూ తాను కూడా యూనివర్సిటీ పూర్వ విద్యార్థినని, వారి భవిష్యత్ కోసం యూనివర్సిటీ ప్రొఫెసర్లు ఎల్లప్పుడూ కష్టపడుతూ ఉంటారని, విద్యార్థుల విజయంలో వారి కృషి వెలకట్టలేనిదని తెలిపారు. వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ కృపాదాస్ మాట్లాడుతూ సమాజాన్ని మార్చాలంటే ప్రతి ఒక్కరూ చదువునే ఆస్త్రంగా ఉపయోగించాలని, చదువుకు పేదరికం అడ్డుకాదని అన్నారు.కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పట్టేటి రాజశేఖర్, అసిస్టెంట్ డైరెక్టర్ రంజన్, ప్రొఫెసర్ అశోక్, వికాస్ ఆగ్రో సైన్సెస్ చైర్మన్ కే. సత్యన్నారాయణ. ఎడిఎ రాజన్, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ చలివేంద్ర రాజీవ్, పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎయిడ్స్ వ్యాధి పై ఉన్న అపోహలను తొలగించెందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలని జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి సూచించారు. జిజిహెచ్ శుశ్రుత హాలులో గురువారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో మెడికల్ పీజీ విద్యార్థులకు ఫార్మ, ఐ సి టి సి, స్వచ్ఛంద సంస్థలకు ఎయిడ్స్ పై అవగాహన సదస్సు జరిగింది. తల్లి తండ్రుల నుంచి పిల్లలకు ప్రమాదకర వ్యాధి సంక్రమించకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నా చర్యల గురించి ఆమె వివరించారు. సీనియర్ మెడికల్ అధికారి డాక్టర్ టి ప్రభాకర రావు, చర్మ వ్యాధుల శాఖ వైద్యులు డి ఎస్ ఎస్ ప్రసాద్, ప్రాజెక్ట్ అధికారి యల్ మధు, పాల్గొన్నారు.



ఎటువంటి ఫిర్యాదులొచ్చినా వెంటనే పరిష్కరించండి

జిల్లా ఎన్నికల పరిశీలకులు ఎస్.సత్యనారాయణ

ప్రజాశక్తి -పల్నాడు జిల్లా

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా ఎన్నికల పరిశీలకులు ఎస్. సత్యనారాయణ జిల్లాలో పర్యటించారు. పల్నాడు జిల్లా కలెక్టరేట్ కు వచ్చిన ఆయనను జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి, జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. జిల్లాలో జరుగుతున్న సంక్షిప్త ఓటరు నమోదు 2022 -23కు జరుగుతున్న ప్రక్రియ వివరాలను తెలియ జేశారు. అనంతరం డాక్టర్ బి. ఆర్.అంబేద్కర్ స్పందన హాల్‌లో రాజకీయ పార్టీలు,7 నియోజకవర్గాల ఇ.ఆర్.ఓలు,28 మండలాల ఏ.ఇ.ఆర్.ఓలు, ఆయా మున్సి పాలిటీల కమిషనర్లు పాల్గొన్నారు. తొలుత ఓటర్ల జాబితా తయారు చేస్తున్న విధానాలను వివరించారు. రాజకీయ పార్టీల నాయకులు నుంచి గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి మాట్లాడుతూ బతికున్న వారి పేర్లను చనిపోయినట్లు తెలియ జేస్తూ ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని ఒకే వ్యక్తి దరఖాస్తు చేస్తున్నారని అటువంటి వారిని గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటరు జాబితా క్రమ పద్ధతి(సీరియల్)లో లేనందున ఓటర్లకు కలిగే నష్టాలను తొలగించాలని కోరారు. డోర్ నంబరు వలన తలెత్తుతున్న ఇబ్బం దులను రాజకీయ పార్టీల నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చారు. రాజకీయ పార్టీల వినతులను పరిగణనలోకి తీసుకున్న సత్యనారాయణ, వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఓటర్ల జాబితా తయారవుతుందని, ఎటు వంటి ఫిర్యాదులు వచ్చినా



వెంటనే పరి ష్కరించాలని అధికారులను ఆదేశించారు. డూప్లికేట్ ఓట్లు పరిశీలన చేసి వాటిని తొలిగించే ప్రక్రియ చేపట్టాలని సూచిం చారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బూత్ లెవల్, మండల ఎన్నికల రిటర్నింగ్, నియోజక వర్గాల ఎన్నికల రిటర్నింగ్, స్టేషన్ అధికారులు, జిల్లా కలెక్టర్ అధికారుల పేర్లు, ఫోన్ నంబర్లు తప్పని సరిగా పోలింగ్ బూత్ లు, పంచాయతి కార్యాలయాలు,సచివాలయాల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం రాజకీయ పార్టీల నాయకుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. సమీక్షా సమావేశంలో వైసిపి,టిడిపి, జనసేన, బి.జె.పి, సి.పి.ఐ, ఎం. ఐ.ఎం తదితర పార్టీల నాయకులు పాల్గొన్నారు.



ఉపకారవేతనాలు పంపిణీ

ప్రజాశక్తి-నకరికల్లు

క్యూబ్ హైవేస్ రూట్స్ ఫౌండేషన్, నార్కెట్‌పల్లి-అద్దంకి-మేదరమెట్ల (నామ్) ఎక్స్ప్రెస్వే లిమిటెడ్ వారు సంయుక్తంగా మండలంలోని చల్లగుండ్లలోని టిటిడి కళ్యాణమండపంలో స్కాలర్‌షిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కమ్యూనిటీ డెవలప్మెంట్ లో భాగంగా, 25 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 42 మంది ప్రతి భావం తులైన విద్యా ర్థులకు, 11 ప్రత్యేక కేసులకు (కోవిడ్-19 సమయంలో శారీ రక వికలాంగులు, కోవిడ్-19 సమయంలో తల్లిదండ్రులను కోల్పోయినవారు) వారి పై చదువుల కోసం ఒక్కొక్కరికి రూ .10,000 చొప్పున స్కాలర్‌షిప్పులు అందజేశారు. ముఖ్య అతిథిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మానవ హక్కుల చైర్మన్ జడ్జి కాకుమాను పెద పెరిరెడ్డి హాజరయ్యారు. కార్య క్రమంలో క్యూబ్ హైవేస్ కంపెనీ షిబాశిష్ సాహూ,ఎంపిడిఒ బండి శ్రీనివాస్ రెడ్డి, నామ్ ప్రాజెక్ట్ నిర్వాహకులు టి.ప్రసాద్, ముకేశ్, రాము, నాగార్జున, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు,నామ్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బిసి సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా రామచంద్రరావు

ప్రజాశక్తి-విజయపురిసౌత్



ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెల్దుర్తి మండలం, పట్లవీడుకు చెందిన బాలేబోయిన రామ చంద్రరావు నియమితులయ్యారు. బిసి సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు ఓర్సు బాల వీరాస్వామి నుండి నియామక పత్రాన్ని ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ ముందుగా తన పదవి పట్ల బాధ్యతగా వ్యవహరిస్తానని, జిల్లాలలోని బీసీ వర్గానికి చెందిన కులాల నాయకులతో ఐక్యంగా సమన్వయంతో వ్యవహరిస్తానన్నారు. పల్నాడు జిల్లాలలోని అన్ని నియోజకవర్గాలలోని మండలాలను పర్యటించి బీసీల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

23 మంది లబ్దిదారులకు సిఎం రిలీఫ్ ఫండ్

ప్రజాశక్తి-మాచర్ల: నియోజకవర్గ పరిధిలోని 23 మంది లబ్దిదారులకు ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ నుండి రూ రూ16.18లక్షలు పంపిణి చేసినట్లు ప్రభుత్వ విప్, ఎం.ఎల్.ఎ పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని ఎం.ఎల్.ఎ కార్యా లయంలో గురువారం ఉదయం జరిగిన కార్యక్రమంలో లబ్దిదారులకు చెక్కులు పంపిణి చేశారు.

కార్మికులకు భద్రతా చర్యలు అభినందనీయం

ప్రజాశక్తి-మాచర్ల: స్థానిక కెసిపి సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం తమ కార్మికుల కోసం తీసుకుంటున్న భద్రత చర్యలు అభినంద నీయమని గనుల శాఖ అధికారులు అన్నారు. స్థానిక కెసిపి సిమెంట్ ఫ్యాక్టరీకి చెందిన తేరాల లైమ్ స్టోన్ మైన్, డిపాజిట్ 2 లైమ్‌స్టోన్ మైన్స్ నందు గనుల భద్రత వారోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు.

రసవత్తరం.. రాయబార ఘట్టం

ప్రజాశక్తి-కారెంపూడి:



పల్నాటి ఉత్సవాల్లో భాగం గా రెండవ రోజు గురు వారం నాడు నిర్వహించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రాయబారం ఘట్టాన్ని అత్యంత రసవత్తరంగా వీర్ల దేవాలయంలో నిర్వహించారు. చారిత్రక సన్నివేశాలు ఇతి వృత్తంగా ఈ ప్రదర్శన కొనసాగింది.

'ఫ్యామిలీ డాక్టర్' పై ప్రచారం నిర్వహించండి

ప్రజాశక్తి -సత్తెనపల్లి రూరల్



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానం పై గ్రామాల్లో విస్తత ప్రచారం నిర్వహించాలని పల్నాడు జిల్లా డిప్యూటీ వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి.చంద్రశేఖర్ వైద్య ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు.సత్తెనపల్లి డివిజన్ పరిధిలోని ఫణిదం,అచ్చంపేట,ముప్పాళ్ల పి.హెచ్.సి.లకు చెందిన వైద్యాధికారులు ఆరోగ్య సిబ్బంది, పర్యవేక్షక సిబ్బందికి ఫణిదం పి.హెచ్.సి.ఆవరణలో డాక్టర్ జి.చంద్రశేఖర్, జిల్లా గణాంక అధికారి నీలకంఠేశ్వరావుల ఆధ్వర్యంలో ప్రత్యేక సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు.. చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్ని పి.హెచ్.సి.లలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానమును గ్రామాలలో బాగా ప్రచారం చేయాలని ఆదేశించారు. నీలకంటేశ్వరరావు మాట్లాడుతూ ప్రత్యేకంగా పేర్కొన్న పి.హెచ్.సి.లలో గర్భవతుల నమోదు , ఇతర ఆర్‌సి హెచ్ పోర్టల్ సర్వీసెస్,ఇతర జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో ఇప్పటివరకు పెండింగ్ లో వున్న అన్నింటినీ వారం రోజుల లోపల పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి డివిజన్ ప్రోగ్రాం అధికారి డా. నాగ పద్మజ,ఫణిదం వైద్యాధికారులు డా. ప్రదీప్,కవిత ముప్పాళ్ల వైద్యాధికారి డా.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పాటిబండ్లలో 'గడపగడపకు'

ప్రజాశక్తి- పెదకూరపాడు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. గురువారం మండలంలోని పాటిబండ్లలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముద్రించిన కరపత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

పేదల పొట్ట కొట్టిన జీవీ: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఈపూరు

పేదల పొట్ట కొట్టిన ఘనుడు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులను స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తీవ్ర విమర్శలు చేశారు. మండలంలోని ఇనిమెళ్లలో రెండవ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వ హించారు. గ్రామంలో ఎస్సీ కాలనీ గడపగడపకు తిరుగు తుండగా కాలనీవాసులు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరడంతో తహశీల్దార్ సిహెచ్ విజయజ్యోతి కుమారిని ఆరా తీయగా రెండో విడత ఇళ్ల స్థలాలకు వచ్చిన దరఖాస్తులు విచారణ నేపథ్యంలో నిలిచి పోయన్నారు.

'ఇదేం ఖర్మ'పై టీడీపీ సమీక్ష

ప్రజాశక్తి-నరసరావుపేట

వైసిపి ప్రభుత్వంలో ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను తెలుసుకునేందుకు టీడీపీ చేపట్టిన 'ఇదేం ఖర్మ' అనే వినూత్న కార్యక్రమంపై నరసరావుపేట నవయుగ కన్వెన్షన్ లో గురువారం సమీక్షా సమావేశం జరిగింది. పల్నాడు టీడీపీ పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడు జివిఎస్ ఆంజనేయులు, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అధ్యక్షతన ఈ సమావేశం నిర్వ హించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకువెళ్లడంతో పాటు టిడిపి హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించాలని కోరారు. 'ఏ సభలో అయి తే మా నాయకుడు నారా చంద్రబాబునాయుడు అవ మానించబడ్డారో అదే సభకుచంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిని చేసి రారాజుగా పంపించే వరకు వాచా,కర్మణా కష్ట పడి పని చేస్తాను' అని చదలవాడ ప్రతిజ్ఞ చేశారు.

ప్రైవేటు భూములకు రక్షణ లేదు

ప్రజాశక్తి-నరసరావుపేట

వైసిపి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ, మిషనరి భూములతో పాటు ప్రయివేట్ భూములకు కూడా రక్షణ లేకుండా పోయిందని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జివి ఆంజనేయుల ఆరోపించారు. ఢిల్లీ లిక్కర్ స్కాం బయట పడుతుందనే ఫోన్ పోయిందని కొత్త డ్రామాకు తెర తీశారని, విజయసాయి రెడ్డి చెప్పేవన్ని కట్టు కథలేనని అన్నారు. ఈడి సమగ్ర దర్యాప్తు చేసి ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో ఎవరెవరు ఉన్నారో బయట పెట్టాలని డిమాండ్ చేశారు.



ఏబీఎం ఆస్తులను కాపాడాలని కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-వినుకొండ

పట్టణంలో అన్యాక్రాంతమవుతున్న క్రైస్తవ ఆస్థులను కాపాడాలని కోరుతూ స్థానిక ఇమ్మానియేలు తెలుగు బాప్టిస్టు చర్చి అభివృద్ధి కమిటీ సభ్యులు, ఇమ్మానియేలు బాప్టిస్టు చర్చి సంఘ పెద్దలు గురువారం పల్నాడు జిల్లా కలెక్టరు లోతేటి శివశంకర్ లోతేటిని కలిసి వినతిపత్రం అందజేశారు. వినుకొండ పట్టణంలో అమెరికన్ బాప్టిస్టు ఫారెన్ మిషన్ సొసైటీకి చెందిన విలువైన ఆస్థులు పట్టణ ప్రధాన కూడళ్లలో ఉన్నాయని వారు కలెక్టరుకు తెలిపారు. 70 ఏళ్ల క్రితం ప్రారంభమైన ఎ.బి.ఎం. పాఠశాలకు చెందిన స్థలాన్ని కొందరు భూకబ్జాదారులు అమ్ముకోవడం వలన పాఠశాల మూతపడిందని తెలిపారు. అలాగే, కొందరు స్వార్ధపరులు వారి ఆర్థిక అవసరాల కోసం పట్టణంలో ఉన్నటువంటి క్రైస్తవ ఆస్థులన్నింటినీ తక్కువ ధరలకు వారికి ఎలాంటి హక్కు లేకపోయినా నకిలీ పత్రాలు సష్టించి అమ్మారని కలెక్టరు దృష్టికి తెచ్చారు. ఉమెన్స్ బంగళా, ఎ.బి.ఎం. స్కూల్, హెల్త్ సెంటర్‌లకు సంబంధించిన స్థలాలను రియల్‌ఎస్టేట్ మాఫియా, భూకబ్జాదారులు తప్పుడు దస్తావేజులు సృష్టించి అమ్మారన్నారు. చర్చి ఆస్తులను తిరిగి ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చికి అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ త్వరలో తాను వచ్చి స్థలాలను పరిశీలించి తగు చర్యలు తీసు కుంటానని చెప్పారు.

భూ వివాదంపై ఇరువర్గాలతో కలెక్టర్ చర్చలు

ప్రజాశక్తి - యడ్లపాడు

స్పందనలో వచ్చిన అర్జీల ఆధారంగా యడ్లపాడు మండలం సొలసలో భూ వివాదాలకు సంబంధించి జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి బుధవారం రాత్రి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇరువర్గాలతో సమస్య పరిష్కారానికి చర్చలు నిర్వహించారు. 2006- 2007లో 23 మంది చెం చులకు 16.7 ఎకరాల భూమిని ప్రభుత్వం ఇచ్చింది. అయితే, కొంతమంది చెంచులు వారి భూములను అమ్మడంతో, వాటిని కొనుక్కున్నవారు గత నాలుగేళ్ల నుంచి అసలు పట్టాదారులను సాగు చేయనివ్వడం లేదు. దీంతో వివాదం ముదిరి పలు మార్లు స్పందనలో ఫిర్యాదులు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ భూములను పొందిన వారు అమ్ము కోవడానికి వీలు లేదు కనుక, వాటిని కొనుగోలు చేసిన వాళ్లు మధ్యే మార్గంగా సమస్యను పరిష్కరించుకోవాలని సూచిం చారు. అయితే, ఆ భూములను కొనుక్కున్నవాళ్లు ముప్పై రోజుల వ్యవధి కావాలని తమ పెద్దలతో చర్చించి, మళ్లీ సమా వేశం నిర్వహించాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ డిసెంబర్ 7న అందరి సమక్షంలో మళ్లీ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమస్య పరిష్కారా నికి ఇరువర్గాలు సహకరించాలని కోరారు. రెవెన్యూ డివిజన్ అధికారి శశిరెడ్డి, మండల రెవెన్యూ అధికారి నాగ మల్లేశ్వర రావు, మండల పరి షత్ అధికారి పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థినితో తహశీల్దార్, ప్రిన్సిపాల్ తదితరులు

ఎఎస్ఎన్ ఫార్మసి కాలేజీలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాల్లో గురువారం రక్తదాన శిభిరం నిర్వహించారు. 61వ జాతీయ ఫార్మసీ వారోత్సవాల్లో భాగంగా ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ స్టూడెంట్ ఫోరం, ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన రాష్ట్ర శాఖ, రెడ్ క్రాస్ సొసైటీ తెనాలి యూనిట్, ఎన్ఎస్ఎస్ యూనిట్, రెడ్‌క్రాస్ ఏఎస్ఎన్ చాప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిభిరాన్ని తహశీల్దార్ కె.రవిబాబు, రెడ్ క్రాస్ కార్యదర్శి ఎం.భానుమతి ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ పర్యవేక్షణలో జరిగిన శిభిరంలో తహశీల్దార్ మాట్లాడుతూ రక్తదానం ఓ సామాజిక బాధ్యతన్నారు. వివిద ప్రమాదాల్లో గాయపడి చికిత్స పొందేవారికి ప్రాణదానం చేసినట్టేనన్నారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి ఎం.భానుమతి మాట్లాడుతూ రక్తదానంతో ఎలాంటి ప్రమాదం లేదన్నారు. ప్రతి ఆరునెలలకోసారి రక్తదానం చేయటంద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చునన్నారు. శిబిరంలో బి.ఫార్మసి, డి.ఫార్మసి విద్యార్థులు రక్తదానం చేశారు. విద్యార్థులు 30 యూనిట్లు రక్తదానం చేసినట్లు ఐపిఎఎస్ఎఫ్ మెంటార్స్ కె.కల్యాచక్రవర్తి, ఎ.సోనిప్రియాంక, ఎన్.ఆశాజ్యోతి రెడ్ క్రాస్ కన్వీనర్ డాక్టర్ టి.లక్ష్మీదుర్గ తెలిపారు.



కళాశాలలో జరుగుతున్న స్పోర్ట్స్ బైక్ డెమో

నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలి

ప్రజాశక్తి -మేడికొండూరు.

ద్విచక్రవాహనదారులు నిబంధనలు పాటిస్తూ,తగిన సెఫ్టీతో వాహనాలు నడపాలని ఎన్ఆర్ఐ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కోట శ్రీనవాస్ తెలిపారు. గురువారం మండలంలోని ఇసుదల అడ్డరోడ్డు వద్ద గల ఎన్ఆర్ఐ అయితే ఇంజనీరింగ్ కళాశాలలో స్పోర్ట్స్ బైక్ డెమో కార్యక్రమం జరిగింది. ప్రముఖ టూ వీలర్ తయారీ కంపెనీ బజాజ్‌కు చెందిన పల్సర్ ఎస్ఎస్ 125 స్ట్రోక్స్ ద్విచక్ర వాహనాన్ని నిపుణుల సమక్షంలో ప్రత్యేకష్టంసు విభిన్న పద్ధతులలో బైక్ స్టంట్సును చేసి అబ్బురపరిచారు. ద్విచక్ర వాహనం యొక్క ప్రాముఖ్యత ఫీచర్స్, సేఫ్టీ పై విద్యార్థులకు వివరించారు. కోట శ్రీనివాస్ మాట్లాడుతూ " ప్రతి ఒక్కరూ తప్పకుండా హెల్మెట్ ధరించి, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. వరుణ్ బజాజ్ మేనేజర్ శ్రీనివాస్, పలువురు అధ్యాపక సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

కెఎల్‌యులో అధ్యాపకులకు అటోడెస్క్ శిక్షణ

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఆటో డెస్క్ ద్వారా కెఎల్. విశ్వవిద్యాలయంలోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో అధ్యాపకులకు మూడు రోజులపాటు ప్రత్యేక శిక్షణా తరగతులను నిర్వహించినట్లు మెకానికల్ విభాగ అధిపతి డాక్టర్ టి విజయ్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మెకానికల్ విభాగ అధిపతి డాక్టర్ టి. విజయ్ కుమార్ మాట్లాడుతూ అధ్యాపకులకు జరుగుతున్న ఈ ఆటో డెస్క్ శిక్షణా తరగుతులను నిర్వహించడానికి డిజైన్ ల్యాబ్ హైదరాబాదు నుండి నలుగురు సభ్యుల బృందం వచ్చినట్లు తెలిపారు. నైపుణ్య అభివృద్ధి విభాగం అధిపతి డాక్టర్ ఎ. శ్రీనాథ్ ఆటోడెస్క్ ద్వారా నిర్వహించే ఎఫ్‌డిపి యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు.ఆటోడెస్క్ నుండి మిస్టర్ రమేష్ పుడేల్, ఆటోడెస్క్ ఉత్పత్తులతో పరిశ్రమ 4.0 కెరీర్ సంసిద్ధత కోసం కొత్త తరం నైపుణ్యాలను విద్యార్థులకు ఏవిదంగా అందించాలనే అంశాలపై ప్రసంగించారు.

విత్తన అక్రమ నిల్వలుంటే కఠిన చర్యలు



తనిఖీలు చేస్తున్న సిహెచ్‌తిరమల దేవి, అధికారులు

ప్రజాశక్తి- పొన్నూరు రూరల్

విత్తనాలను నిల్వ ఉంచితే కఠిన చర్యలు తప్పవని గురువారం వ్యవసాయ సంచాలకులు సిహెచ్. తిరుమల దేవి, వ్యవసాయ అధికారి డేగల వెంకట్రామయ్య అన్నారు. మండలంలోని పలు దుకాణాల్లో అధికారులు గురువారం తనిఖీలు చేశారు. విత్తనాల రిజిస్ట్రేషన్ బిల్లుల పుస్తకాలు, విత్తనాల లైసెన్సులు, వివిధ రకాల కంపెనీల అనుమతులు లేని విత్తనాలను, అమ్మ వద్దని అమ్మకాలు నిలుపుదల చేశారు. వివిధ కంపెనీలకు చెందిన జొన్న, మొక్కజొన్న విత్తనాలు తీసి శాంపిళ్లను ప్రయోగశాలకు పరీక్ష నిమిత్తం పంపించారు. సిహెచ్ తిరమల మాట్లాడుతూ రైతులు తాము కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించిన రసీదులను తీసుకొని రసీదులలో రైతుల సంతకాలు చేయాలని కోరారు.అలాగే అనుమతులు లేని విత్తనాల అమ్మే దుకాణాలను విత్తన చట్టం1983 ప్రకారం కఠినంగా శిక్షించడం జరుగుతుందని తెలిపారు. అమ్మకాలు నిలుపుదల చేసిన మొక్కజొన్న విత్తనాలు అనగా 2048 కిలోల ఉన్నాయి. వీటి విలువ రూ.8.96లక్షల వరకు ఉంటాయని, ఎవరైనా విత్తనాల చట్టం అతిక్రమించి వ్యాపారం చేస్తే వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

యుద్ధప్రాతిపదికన రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి - తాడేపల్లి

బ్రహ్మానందపురంలో గురువారం యుద్ధప్రాతిపదికన రోడ్డు నిర్మించారు. స్థానిక ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి ఈ ప్రాంతంలో పర్యటించిన సందర్భంగా రైల్వే గేటు సమీపంలో 40 ఏళ్లుగా రోడ్డు లేదని స్థానికులు ఎమ్మెల్యే ఆర్కె దృష్టికి తీసుకువచ్చారు. సచివాలయ సిబ్బంది ద్వారా సమస్యను నమోదు చేసుకొని, టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి గురువారం రోడ్డు పనులు ప్రారంభించి పూర్తిచేశారు. ఈ సందర్భంగా స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. రోడ్డు పనులను పరిశీలించిన వారిలో పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, జిల్లా కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజు, అధికారులు పాల్గొన్నారు.



అన్నా క్యాంటిన్ వద్ద టిడిపి నాయకులు

అన్న క్యాంటీన్‌ను సందర్శించిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - తాడేపల్లి

అసాంఘీకశక్తులకు అడ్డాగా మారిన అన్న క్యాంటీన్ శీర్షికన ప్రజాశక్తిలో వచ్చిన వార్తాకథనంపై టిడిపి నాయకులు స్పందించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నివాసం సమీపంలో గతంలో అన్న క్యాంటీన్‌గా సేవలు అందించిన ప్రాంతంలో మద్యం సీసాలు ఉండటాన్ని చూసి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను కూడా బార్‌షాపులుగా మారుస్తుందని ఎద్దేవాచేశారు. అన్న క్యాంటీన్ చుట్టుపక్కల కల్లు దుకాణాలు ఉండటం పట్ల అభ్యంతరం వ్యక్తంచేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరారు.

'ముస్లిమ్ మైనార్టీలపై టిడిపి కపట ప్రేమ'

ప్రజాశక్తి-దుగ్గిరాల



ముస్లిమ్ మైనార్టీలపై టిడిపి కపట ప్రేమ చూపిస్తోందని వైసిపి మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. గురువారం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ " జగన్ కు హఠాహెూ - బాబుకు బులావో - లోకేష్ కు జితావో " నినాదంతో టీడీపీ నేతలు ముస్లింల ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేయడం విడ్డూరమని అన్నారు. ముస్లింలను టిడిపి కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తోందని, అనేక సార్లు మైనార్టీల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించిందన్నారు. రానున్న కాలంలోనూ సిఎంగా జగన్ మోహన్ రెడ్డి మాత్రమే ఉండాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారని పేర్కొన్నారు. సమావేశంలో మైనార్టీ నేతలు షేక్ రషీద్, షేక్ జాను, పఠాన్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

పన్నులు వేయటంలో జాప్యం వద్దు

ప్రజాశక్తి - మంగళగిరి

ఖాళీ స్థలాలు, నివాస గృహాలకు పన్నులు వేయటంలో అశ్రద్ధ వహించవద్దని మున్సిపల్ చట్ట ప్రకారం పన్నులు వేయాలని ఈ సమస్యపై ప్రజల నుండి అనేక ఫిర్యాదులు వస్తున్నాయని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయంలో ఎంటిఎంసి పరిధిలోని సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖాళీ స్థలాలు పిచ్చి మొక్కలు, మురుగు నీరు పందులతో అధ్వాన్నంగా మారుతున్నాయని అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో అకౌంట్ సెక్షన్‌లోని సీనియర్ అకౌంటెంట్ శివకాంత్ టిడ్కో చెక్కుల ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఇరువురు మహిళా లబ్ధిదారులు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికు ఫిర్యాదు చేశారు. టిడ్కో గృహాల్లో ఇల్లు పొందిన వెంట్రప్రగడ వెంకట బసవపూర్ణమ్మ అనే మహిళ లబ్ధిదారుని వాటాగా అదనంగా చెల్లించిన రూ.25వేల డిడి తిరిగి ఇవ్వటంలో డీడీలో వి వి బసవపూర్ణమ్మ అని ఉందని డిడి ఇవ్వకుండా 15 రోజుల నుంచి నగరపాలక సంస్థ కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అదే విధంగా మరో లబ్ధిదారిని పఠాన్ సుభాన్‌బీ లబ్ధిదారుని వాటాగా అదనంగా చెల్లించిన రూ.25వేల డిడి ఇంకా రాలేదని ఎమ్మెల్యేకు విన్నవించుకుంది. దీంతో ఎమ్మెల్యే ఆర్కే వెంటనే అకౌంట్ సెక్షన్‌లోని సీనియర్ అకౌంటెంట్ శివకాంత్‌ని పిలిపించి మహిళలను ఆఫీసు చుట్టూ తిప్పించుకుంటూ ఇబ్బందులకు గురి చేయటం ఏమిటని, వెంటనే వారి సమస్య పరిష్కరించమని ఎమ్మెల్యే సూచించారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే ఆర్కేకు ఇరువురు మహిళలు ధన్యవాదాలు తెలిపారు.



విద్యావైజ్ఞానిక సదస్సు ప్రారంభోత్సవంలో నాయకులు,ఉపాధ్యాయులు

పాఠ్యాంశాలను ప్రయోగత్మకంగా అందించడమే..

ప్రజాశక్తి-తెనాలి

పాఠ్యాంశాలను ప్రయోగాత్మకంగా విద్యార్థులకు అందించడంలో విద్యా వైజ్ఞానిక సదస్సులు ఎంతగానో ఉపయోగ పడతాయని పెదరావూరు సర్పంచ్ కాకి రామాదేవి అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా వైజ్ఞానిక సదస్సును గ్రామ ఆమె ప్రారంభించి మాట్లాడారు. సదస్సులో విద్యార్థులు గణితం, సైన్స్, సోషల్ స్టడీస్‌కు చెందిన వివిద పాఠ్యాంశాలపై నమూనాలను తయారు చేసి ప్రదర్శనలో ఉంచారు. ప్రధానోపాధ్యాయులు కె.ప్రభాకరరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు అనివార్యమన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కె.శంకరరావు, ఉపాధ్యాయులు ఎం.ప్రదీప్‌కుమార్, బి.సుధాకరరావు, జి.మాధవీకుమారి, ఎ.ప్రమీలారాణి, ఆర్,ఉమాదేవి, బి.ప్రసన్న పాల్గొన్నారు.



చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీసభ్యులు

మెజీషియన్ చంద్రశేఖర్‌కు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక బోస్‌రోడ్డులోని పెమ్మసాని థియేటర్‌లో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారధ్యంలో నిర్వహిస్తున్న ఎన్‌టిఆర్ శతాబ్ది ఉత్సవాల్లో గురువారం ప్రముఖ మెజీషియన్, రంగస్థల సీనియన్ కళాకారుడు రావూరి చంద్రశేఖర్‌ను ఉత్సవ కమిటీ ఘనంగా సత్కరించింది. ఎన్టీఆర్ నటించిన అగ్గిరవ్వ చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. కార్యక్రమంలో టి. హరిప్రసాద్, అన్నం పిన్నారావు, కె.సత్యనారాయణ, సిహెచ్.బాబురావు, పి.చిన్నారావు, ఇ.ప్రేమ్‌కుమార్, దివి హరిప్రాద్, పి.పోతురాజు, ఎ.మల్లేశ్వరరావు, ఎం.రాఘవరావు, జి.ప్రపాద్, డి.భాస్కర్ పాల్గొన్నారు.



శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

బ్యూటీషియన్ కోర్సు శిక్షణా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-తెనాలి

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక గంగానమ్మపేట టూటౌన్ పోలీస్ స్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేసిన బ్యూటీషియన్ కోర్సు శిక్షణా కేంద్రాన్ని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న రోటరీ క్లబ్ మహిళల కోసం బ్యూటీషియన్ కోర్సును ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నశీం మాట్లాడుతూ బ్యూటీషియన్ కోర్సు మహిళల స్వయం ఉపాదికి దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గొడవర్తి సాయిహరేరామ్, క్లబ్ అధ్యక్షులు జెట్టి శివరామకృష్ణప్రసాద్, జెట్టి అంకినీడు. అక్కినేని రమాదేవి, క్లబ్ సభ్యులు నితిన్ చందన, మురళి, చేతన్‌రాజ్ కొఠారి, పి.రాంబాబు, జె.నాగేశ్వరరావు, తాతాజి. అన్నం పిన్నారావు, జగదీశ్వరాంబ పాల్గొన్నారు.

పోలెండ్ సదస్సుకు ఎస్ఆర్ఎం విద్యార్థిని


శరణ్య శేఖరన్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

పోలెండ్ లోని వార్సా యూనివర్సిటీలో ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహించే బయోటెక్నాలజీ సదస్సుకు ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ పరిశోధక విద్యార్థిని శరణ్య శేఖరన్ ఎంపికయ్యారు. ప్రపంచ దేశాలన్నీ మైక్రోబయాలజీ ఫాదర్‌గా కొనియాడే ప్రఖ్యాత శాస్త్రవేత్త లూయి పాశ్చర్ 200వ జయంతి వేడుకల్లో భాగంగా పోలెండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ వార్సా యాజమాన్యం బయోటెక్నాలజీ నూతన ఆవిష్కరణలపై ప్రత్యేక సదస్సు నిర్వహిస్తోంది, పాశ్చర్-2022గా పిలువబడే సదస్సులో పాల్గొనేందుకు శరణ్య తయారు చేసిన 'ఒన్ హెల్త్ అప్రోచ్' ప్రాజెక్టు దోహదపడింది. ఐదు రోజుల పాటు శరణ్య పోలెండ్ యూనివర్సిటీలో ఉండేందుకు వీలుగా ఆ యూనివర్సిటీ ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు శరణ్యకు డీబీటీ ట్రావెల్ గ్రాంట్ మంజూరైందని ప్రొఫెసర్ జయశీలన్ పేర్కొన్నారు. శరణ్య శేఖర్‌ను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కె.అరోరా, ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి,నారాయణరావు అభినందించారు.

రైఫిల్ షూటింగ్‌లో కెఎల్‌యు విద్యార్థి రికార్డు

జాతీయ స్థాయిలో రెండు బంగారు పతకాలు కైవసం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్


పతకాలతో ముఖేష్

జాతీయ స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో కెఎల్‌యు విద్యార్థి రెండు బంగారు పతకాలు సాధించినట్లు వర్సిటీ క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్ గురువారం తెలిపారు. నేషనల్ రైఫిల్ అసోసియేషన్ అధ్వర్యంలో ఈ నెల 20 నుండి వచ్చే నెల 5వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరుగుతున్న రైఫిల్ షూటింగ్ నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఫిస్టల్ విభాగంలో ఎన్.ముఖేష్ 25 మీటర్ల ఫిస్టల్ సివిలియన్ విభాగంలో బంగారు పతకంతో పాటు అరుదైన జాతీయ రికార్డును నెలకొల్పినట్లు తెలిపారు. 600 పాయింట్లకు గాను 584 పాయింట్లు సాధించి సరికొత్త జాతీయ రికార్డును ముఖేష్ సాధించాడని పేర్కొన్నారు. ఐఎస్.ఎస్.ఎస్ విభాగం లోనూ బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడని చెప్పారు. ముఖేష్‌ను కెఎల్.విశ్వవిద్యాలయం యాజమాన్యం, వైస్ ఛాన్సలర్ డాక్టర్.జి.పార్ధసారధివర్మ, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్.ఎన్ వెంకటరామ్, రిజిస్ట్రార్ ఎ.జగదీష్ డీన్, విద్యార్థి విభాగం సంక్షేమాధిపతి హనుమంతరావుల, అధ్యాపకులు అభినందించారు.

జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షులు జానీసాహెబ్‌కు మేయర్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-గుంటూరు



గుంటూరు జిల్లా వక్ఫ్ బోర్డు ప్రెసిడెంట్‌గా నియమితులైన షేక్ జానీ సాహెబ్ (జిలాని)కు మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. మేయర్‌ను ఆయన కార్యాలయంలో జాని సాహెబ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జానీసాహెబ్‌ను మేయర్ సత్కరించారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు డైరెక్టర్లు షేక్ సుభాని, షేక్ జానిబాష, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి మున్సిపల్ కార్మికుల నిరసనలు

రాజధాని పారిశుధ్య కార్మికులకు సంఘీభావంగా

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని పారిశుధ్య కార్మికుల రిలే నిరాహార దీక్షలకు సంఘీభావంగా శుక్ర,శని వారాల్లో మున్సిపల్ కార్మికులు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వానికి నిరసనలు తెలుపుతారని గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బి.ముత్యాలరావు ప్రకటించారు. తుళ్లూరు సిఆర్‌డిఎ కార్యాలయం వద్ద రాజధాని పారిశుధ్య కార్మికులు చేపట్టిన దీక్షలు 6వ రోజుకు చేరాయి. గురువారం శిబిరాన్ని సందర్శించి ప్రారంభించిన ముత్యాలరావు మాట్లాడుతూ రాజధాని కార్మికులకు పని భద్రత కల్పించాలని, అసెంబ్లీ, హైకోర్టులో పని చేస్తున్న 29 గ్రామాల పారిశుధ్య కార్మికులు పెండింగ్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వీరిని ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్‌లోకి తీసుకోవాలని, వీరు కోరుతున్న అంశాలన్నీ న్యాయమైనవని అన్నారు. కనీస వేతనం అమలు చేయకపోగా నాలుగో నెల గడుస్తున్నా జీతాలు ఇవ్వకపోవడం దారుణమని, ఇది కార్మిక చట్టాలను ప్రభుత్వం ఉల్లంఘించడం కాదా..? అని ప్రశ్నించారు. రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు ఎం.రవి మాట్లాడుతూ కార్మికులు 37 రోజులుగా నిరసనలు, ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదని మండిపడ్డారు. దున్నపోతు మీద వర్షం పడ్డట్టుగా ప్రభుత్వం వ్యవహరిస్తుడడంతో రిలేదీక్షలు చేస్తున్నారని, ఇప్పటికైనా స్పందించకుంటే సిఐటియు ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.


దీక్షా శిబిరం వద్ద కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న బి.ముత్యాలరావు

కార్యక్రమంలో రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం కార్యదర్శి రాచూరి వేణు, నాయకులు దుర్గ, ఫణి, కొండమ్మ, మరియదాసు, జోజి, రాజారావు, లక్ష్మణరావు, రత్నకుమారి, ఎస్‌కె మరియంబీ, సుబ్బాయమ్మ, యేసు మరియమ్మ, కోటేశ్వరి, మాధవి, నాగేశ్వరమ్మ పాల్గొన్నారు.

రాజధాని పారిశుధ్య కార్మికులకు సిపిఎం మద్దతు

ప్రజాశక్తి-తాడేపల్లి

జీతాలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న రాజధాని పారిశుధ్య కార్మికులకు సిపిఎం తాడేపల్లి పట్టణ కమిటీ మద్దతు తెలిపింది. పట్టణ కమిటీ సమావేశం డి.శ్రీనివాసకుమారి అధ్యక్షతన గురవారం నిర్వహించగా జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో పెంచిన చెత్త పన్నును వెంటనే ఉపసంహరించుకోకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రజల సమస్యలను పక్కనపెట్టి అధికార, ప్రతిపక్షాలు ఎన్నికల వాతావరణం సృష్టించాయని, నాయకులు బూతుల పురాణం కట్టిపెట్టాల అన్నారు. బిజెపి మోసకారి విధానాలపై కలిసి వచ్చే శక్తులతో సిపిఎం పోరాడుతుందని ఉద్ఘాటించారు. విశాఖ వచ్చిన ప్రధానిని ఉక్కు ప్రైవేటీకరణపై సిఎం ప్రశ్నించకపోవడాన్ని తప్పుబట్టారు. పవన్ కల్యాన్ ఎటువైపు ఉంటారో తేల్చుకోవాలన్నారు. విపక్ష రాష్ట్రాల పట్ల గవర్నర్ల పాత్ర అనుచితంగా ఉందన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.రవి, పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పతకాల పిఇటికి కలెక్టర్ సత్కారం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఆరు పదుల వయస్సుల్లోనూ ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొడంతోపాటు బహుమతులు సాధించిన నరసరావుపేట కస్తూర్బా పాఠశాల పిఇటి వెల్లి తంగెల్ విజయను పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్, జెసి శ్యాంప్రసాద్ అభినందించారు. ఈనెల 20న జరిగిన ఆఫ్ మారథాన్లో మొదటి బహుమతి, తెలంగాణ ఉమెన్స్ అథ్లెటిక్ అసోసియేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ నెల 4, 5, 6 తేదీల్లో నిర్వహించిన రెండవ జాతీయ మహిళా మాస్టర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్-2022లో 800 మీటర్లు, 1500 మీటర్ల రన్నింగ్, ఐదు కిలోమీటర్లు, 10 కిలోమీటర్లు నడకలో బహుమతులు పొందారు. ఈ నేపథ్యంలో ఆమెను కలెక్టరేట్‌లోని స్పందన హాలులో కలెక్టర్, జెసి సత్కరించారు.





వివరాలు వెల్లడిస్తున్న క్రెడాయ్ గుంటూరు ఛాప్టర్ ప్రెసిడెంట్ మామిడి రాము

నేటి నుండి క్రెడాయ్ ప్రాపర్టీ షో

క్రెడాయ్ గుంటూరు ఛాప్టర్ అధ్యక్షులు రాము

ప్రజాశక్తి-గుంటూరు

క్రెడాయ్ గుంటూరు ఛాప్టర్ 6వ ప్రాపర్టీ షో శుక్రవారం నుండి మూడ్రోజులపాటు స్థానిక సిద్ధార్థ గార్డెన్స్‌లో నిర్వహిస్తామని క్రెడాయ్ గుంటూరు ఛాప్టర్ ప్రెసిడెంట్ మామిడి రాము తెలిపారు. గుంటూరు నగరం, పరిసర ప్రాంతాల ప్రజలు అందరూ సందర్శించాలని కోరారు. ఈ మేరకు గురవారం విలేకర్లతో మాట్లాడారు. ప్రతి వారికీ సొంత ఇంటి కలను సాకారం చేయటమే ఈ ప్రాపర్టీషో ఉద్దేశమన్నారు. ఈ ప్రాపర్టీషోలో ఎక్కువ మంది బిల్డర్స్ వారి వారి నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్స్‌లోని ఫ్లాట్స్‌ను ఈ షోలో ప్రదర్శిస్తారన్నారు. బ్యాంకర్లు, ఇంటి నిర్మాణానికి కావాల్సిన మెటీరియలర్స్ సరఫరాదారులు అందరూ ఒకే వేదిక మీదకు వస్తారన్నారు. ఎపి క్రెడాయ్ ఛాప్టర్ అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ ఆళ్ల శివారెడ్డి మాట్లాడుతూ క్రెడాయ్ గుంటూరు ఛాప్టర్ వారు వినియోగదారులకు నాణ్యమైన, నమ్మకమైన సేవలు అందించటం అభినందనీయమన్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజల సొంత ఇంటి కల నెరవేర్చటానికి క్రెడాయ్ ఎప్పుడూ సహకారం అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ వినోద్‌రెడ్డి, ఛైర్మన్ సతీష్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సాంబశివరెడ్డి, వెంకటరెడ్డి, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఐటిలో ప్రస్తుత పరిస్థితులపై కిట్స్‌లో సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు


సదస్సులో మాట్లాడుతున్న శేషగిరి

వింజనంపాడులోని కిట్స్ ఇంజినీరింగ్ కాలేజిలో కరెంట్ ట్రెండ్స్ ఇన్ ఐటి ఇండస్ట్రీ అనే అంశంపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి కాన్ సెంట్రిక్స్ కేటలిస్ట్, అట్లాంట, యుఎస్ఎ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కె.శేషగిరి రిసోర్స్ పర్సన్‌గా హాజరయ్యారు. ఐటి సెక్టార్‌లో ప్రస్తుత పరిస్థితులైన ఆర్థిక మాంద్యాన్ని ఎలా అధిగమించాలో వివరిస్తూ ప్రస్తుత కాలమానం ప్రకారం ఏయే అప్లికేషన్లు నేర్చుకుంటే ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయో తెలియజేశారు. కళాశాల ఛైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ కాలమానం ప్రకారం లేటెస్ట్ టెక్నాలజీని ప్రతి విద్యార్థి అప్‌గ్రేడ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాలేజి సెక్రెటరీ కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, విభాగాధిపతి డాక్టర్ జి.భానుప్రకాష్ పాల్గొన్నారు.

ఆర్‌విఆర్ అండ్ జెసి కాలేజీలో ఎన్హాన్స్‌డ్ లెర్నింగ్ విత్ డిజిటల్ రిసోర్సెస్‌పై వర్క్‌షాప్


మాట్లాడుతున్న పెరియస్వామి ప్రదీప్

ప్రజాశక్తి-గుంటూరు

ప్రపంచంలోని మేధావులు పొందుపరిచిన పరిశోధనా పత్రాలు, ప్రచురించిన జర్నల్స్‌ను అధ్యయనం చేయటం ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకోవచ్చని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. కళాశాలలో ఐఈఈఈ ఆధ్వర్యంలో ఎన్‌హ్యాన్స్‌డ్ లెర్నింగ్ విత్ డిజిటల్ రిసోర్సెస్ అనే అంశంపై వర్క్‌షాప్ గురువారం నిర్వహించారు. ఎబ్స్‌కో ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ అండ్ ఐఈఈఈ ట్రైనింగ్ సంస్థ మేనేజర్ డాక్టర్ పెరియస్వామి ప్రదీప్ పాల్గొని రోల్ ఆఫ్ ఐఈఈఈ ఇన్ ఇంజినీరింగ్ ఎడ్యుకేషన్, రైటింగ్ కాల్విటీ టెక్నికల్ పేపర్స్ తదితర అంశాలపై ప్రసంగించారు. ఆధునిక ప్రపంచంలో పోటీ తత్వాన్ని అధిగమించటానికి మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అధ్యాపకులు తెలుసుకొని వాటిని విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవీంద్ర పాల్గొన్నారు.